సంబరాల జీవితం సాభాగ్యాల సారథం
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ESTD: 1999
www.voodayam.com

# వుదయం

సంపుటి : 27 సంచిక : 98 | హైదరాబాద్ | 10-06-2026 బుధవారం
SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on

సంబరాల జీవితం సాభాగ్యాల సారథం
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

# మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' హస్తం

- మహిళల పేరిటే 'ఇందిరమ్మ ఇండ్లు'.. రూ.61 వేల కోట్ల
- రూ.2,400 కోట్లతో అంతర్జాతీయ పండ్ల మార్కెట్
- మహాలక్ష్మికి రూ.10,700 కోట్లు!
- 2034 నాటికి కోటి మంది కోటీశ్వరులు!



**హైదరాబాద్, జూన్ 9 (వుదయం):**

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన, సాధికారతలే పరమావధిగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. రానున్న రోజుల్లో మహిళా సంఘాలకు అదనంగా మరో 3 వేల బస్సులను మంజూరు చేసి, వాటిని అద్దె ప్రాతిపదికన టీజీఆర్టీసీకి అనుసంధానం చేసేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వైభవంగా నిర్వహించిన మహిళా వారోత్సవాల ముగింపు సభలో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మహిళా శక్తి' పథకం కింద మహిళా సంఘాల యాజమాన్యంలో నడవనున్న 553 బస్సులను ఆయన జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు.

2034 నాటికి కోటి మంది కోటీశ్వరులు!

సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి మహిళను ఆర్థికంగా నిలబెట్టే వరకు తమ ప్రభుత్వం విశ్రమించబోదని స్పష్టం చేశారు. ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది సభ్యులు ఉన్నారని, ఈ సంఖ్యను త్వరలోనే కోటికి పెంచుతామని పిలుపునిచ్చారు. 2034 నాటికి ఈ కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని కోటీశ్వరులుగా మార్చడమే తమ ప్రభుత్వ అంతిమ లక్ష్యమని సీఎం ధీమా వ్యక్తం చేశారు. మహిళలు స్థానికంగా పటిష్టమైన వ్యాపార ప్రణాళికలు (బిజినెస్ ప్లాన్స్) రూపొందించుకోవాలని, వారి అభివృద్ధికి అవసరమైన పూర్తి సహకారాన్ని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో అందిస్తామని హామీ ఇచ్చారు. బడులు, బంకులు, క్యాంటీన్ల నిర్వహణ నారీమణులకే.. మహిళల పర్యవేక్షణలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా అమలవుతాయని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళలకే అప్పగించామని గుర్తుచేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 'మహిళా శక్తి క్యాంటీన్లు', పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలను సైతం స్వయం సహాయక సంఘాలకే అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. మహిళల పేరిటే 'ఇందిరమ్మ ఇండ్లు'.. రూ.61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ ఆస్తులు మహిళల పేరిట ఉంటేనే కుటుంబానికి భద్రత ఉంటుందనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లతో పాటు, పట్టణాల్లో నిర్మించే లక్ష గృహాలను కూడా మహిళల పేరిటే కేటాయిస్తామని స్పష్టం చేశారు. మహిళా సంఘాల బలోపేతానికి రూ.61 వేల కోట్ల బ్యాంకు లింకేజీని అందించామని, సున్నా వడ్డీ రుణాల కింద బ్యాంకులకు ప్రభుత్వం తరఫున రూ.2 వేల కోట్లు ఇప్పటికే చెల్లించినట్లు సీఎం వివరించారు. మహాలక్ష్మికి రూ.10,700 కోట్లు! 'మహాలక్ష్మి' పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, ఈ ఉచిత ప్రయాణాల రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.10,700 కోట్లకు పైగా నిధులను విడుదల చేసిందని సీఎం వెల్లడించారు.

రూ.2,400 కోట్లతో అంతర్జాతీయ పండ్ల మార్కెట్

ఇదే వేదికపై నుంచి రైతాంగానికి సీఎం పలు సూచనలు చేశారు. సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. పంటల మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ.. కందులు, మినుములు, పెసలు వంటి పప్పుధాన్యాలతో పాటు కూరగాయలు, పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల అంతర్జాతీయ మార్కెటింగ్ కోసం ప్రభుత్వం రూ.2,400 కోట్లతో అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు .ఈ ఘనమైన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ (సీతక్క), కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులైన మహిళా సంఘాలకు సీఎం చేతుల మీదుగా భారీ సాయం తాలూకు చెక్కులను అందజేశారు.



## కువైట్ సార్వభౌమాధికారానికి భారత్ బాసట..

# శాంతి పునరుద్ధరణే లక్ష్యం

**న్యూఢిల్లీ జూన్ 9 (ఎఎంఎస్) :**



పశ్చిమాసియాలో రోజురోజుకూ ముదురుతున్న ఉద్రిక్త పరిస్థితులపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షోభ నివారణే ధ్యేయంగా ఆయన దౌత్యపరమైన చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, కువైట్ పాలకుడు (అమీర్) షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబీర్ అల్ సబాతో ప్రధాని మోదీ ఫోన్‌లో అత్యవసరంగా మాట్లాడారు. ఆ ప్రాంతంలో శాంతి భద్రతలను పునరుద్ధరించడానికి తక్షణమే దౌత్యపరమైన పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మోదీ పిలుపునిచ్చారు.

**దాడులను తీవ్రంగా ఖండించిన భారత్**

కువైట్, బహ్రెయిన్‌లోని పలు వ్యూహాత్మక ప్రాంతాలపై ఇటీవల ఇరాన్ జరిపిన డ్రోన్ దాడులను ప్రధానమంత్రి తీవ్రంగా ఖండించారు. కువైట్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను దెబ్బతీసేలా జరుగుతున్న ఇలాంటి దాడులను భారత్ ఎంతమాత్రం అంగీకరించబోదని స్పష్టం చేశారు. ఈ మేరకు పశ్చిమాసియాలో శాంతి పరిరక్షణకు భారత్ కట్టుబడి ఉందంటూ ప్రధానమంత్రి కార్యాలయం (PMO) సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విటర్) ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేసింది.

**భారతీయుల క్షేమ సమాచారంపై ఆరా**

కువైట్‌లో పెద్ద సంఖ్యలో నివసిస్తున్న భారతీయ పౌరుల భద్రతపై ప్రధాని మోదీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాజా దాడుల నేపథ్యంలో అక్కడి భారతీయుల క్షేమ సమాచారాన్ని కువైట్ పాలకులను అడిగి తెలుసుకున్నారు. యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ మన దేశస్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన రక్షణ కల్పించాలని కోరారు.

**డ్రోన్ దాడుల విధ్వంసం.. భారతీయుల మృతి**

ఇటీవల కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై టెహ్రాన్ (ఇరాన్) జరిపిన డ్రోన్ దాడి తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ ఘటనలో ఓ భారతీయ పౌరుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో ప్రయాణికులు, విమానాశ్రయ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు.

**గతంలోనూ తప్పని ముప్పు:**

అంతకుముందు మార్చి నెలలోనూ కువైట్‌లోని ఒక కీలకమైన విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారం (పవర్ అండ్ వాటర్ ప్లాంట్) లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడింది. ఆ ఘోర ప్రమాదంలో సైతం ఓ భారతీయుడు మృతి చెందిన విషయాన్ని అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు నిప్పుల కుంపటిలా మారడంతో, దౌత్య చర్చల ద్వారానే ఉద్రిక్తతలను చల్లార్చాలని భారత్ గట్టిగా ఆకాంక్షిస్తోంది.

# విదేశీ టూర్ల పేరుతో డ్రగ్స్ ఉచ్చు

**హైదరాబాద్, జూన్ 9 (వుదయం):**

అంతర్జాతీయ స్థాయిలో మాదకద్రవ్యాల సరఫరా చేస్తున్న ఒక భారీ స్మగ్లింగ్ ముఠా నెట్‌వర్క్‌ను అధికారులు ఛేదించారు. ఈగల్ ఫోర్స్, కస్టమ్స్ మరియు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (NCB) అధికారులు సంయుక్తంగా నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో బ్యాంకాక్ నుంచి భారత్‌కు యథేచ్ఛగా సాగుతున్న గంజాయి అక్రమ రవాణా బట్టబయలైంది. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి నూరికళను అధికారులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి సుమారు రూ. లక్షల విలువైన 2.15 కిలోల 'ఓజీ వీడ్' (హైబ్రిడ్ గంజాయి) ను స్వాధీనం చేసుకున్నారు. ఆర్టిస్టులు, గృహ సహాయకులకు గాలం వేస్తున్న ఈ ముఠా.. వారిని డ్రగ్స్ క్యారియర్లుగా మారుస్తోంది. కేరళకు చెందిన చల్లిల్ పుతన్ పురాయిల్ నఫీద్ ఈ సిండికేట్‌లో కీలక సూత్రధారి అని అధికారులు గుర్తించారు. నిందితురాలు నూరికళను గతంలో మూడుసార్లు బ్యాంకాక్ పంపారని, ఒక్కో ట్రిప్‌నకు కేవలం రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు నగదు ఇచ్చి ఆమె లగేజీలో గంజాయి ప్యాకెట్లను భారత్‌కు చేరవేస్తున్నారని విచారణలో వెల్లడైంది.

మూడు మెట్రో నగరాలే టార్గెట్

ఈ అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్ ప్రధానంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలను కేంద్రంగా చేసుకుని కార్యకలాపా

## శాంతి చర్చల వేళ హర్మూజ్ వద్ద

# అమెరికా హెలికాప్టర్ కూలిపోవడం కలకలం

**వాషింగ్టన్**

పశ్చిమాసియాలో శాంతి భద్రతల పునరుద్ధరణ మరియు ఇరాన్‌తో దౌత్యపరమైన శాంతి ఒప్పందం (పీస్ డీల్) పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న గుప్పెడు ప్రకటనలు క్షేత్రస్థాయిలో మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. 'ఇరాన్‌తో చారిత్రాత్మక ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం' అంటూ దాదాపు రెండున్నర నెలల కిందట ట్రంప్ మొదటిసారి ప్రకటించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన పలు సందర్భాల్లో ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఒప్పందం మాత్రం ఖరారు కాలేదు. సరికదా, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, గడిచిన మూడు నెలల కాలంలోనే ట్రంప్ ఏకంగా 37 సార్లు ఈ 'డీల్' గురించి రికార్డు స్థాయిలో ప్రకటనలు చేయడం గమనార్హం.

**దాడుల అనంతరం మొదలైన దౌత్య పర్వం**

గత ఫిబ్రవరి 28న ఇరాన్ లక్ష్యంగా అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దళాలు మెరుపు దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ దాడులతో పశ్చిమాసియాలో ఒక్కసారిగా యుద్ధ వాతావరణం భగ్గుమంది. ఈ సంక్షోభానికి శాశ్వత ముగింపు పలకడమే ధ్యేయంగా ఇరాన్‌ను చర్చల వేదికపైకి ట్రంప్ ఆహ్వానించారు. ఈ క్రమంలో మార్చి 23న ఆయన వైట్ హౌస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. శాంతి చర్చలలో చాలా అంశాలపై ఉమ్మడి ఏకాభిప్రాయం కుదిరిందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ తర్వాత జరిగిన క్యాబినెట్ భేటీలోనూ.. అమెరికాతో డీల్ కోసం టెహ్రాన్ (ఇరాన్ ప్రభుత్వం) తీవ్రంగా అభ్యర్థిస్తోందని పేర్కొన్నారు.



## నకిలీ పట్టాలతో

# సర్కారు భూమికి ఎసరు

**హైదరాబాద్, జూన్ 9 (వుదయం):**



రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను నకిలీ పట్టాల ద్వారా కొల్లగొట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ శివార్లలోని ఖానామెట్ భూములకు సంబంధించి నకిలీ పట్టాలు సృష్టించిన వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. దీనిపై సమగ్ర విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఒక ఐపీఎస్ స్థాయి అధికారి నేతృత్వంలో 'సిట్' ను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్ర డీజీపీ కి ఉన్నత న్యాయస్థానం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్‌కు రూ. 5 లక్షల భారీ జరిమానా ఖానామెట్‌లోని వివాదాస్పద భూమి తనదేనంటూ కోర్టును ఆశ్రయించిన 'ఇట్టిగా ప్రాపర్టీస్' అనే సంస్థకు హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. నకిలీ పత్రాలతో న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినందుకు గాను ఆ సంస్థకు రూ. 5 లక్షల భారీ జరిమానా (కాస్ట్) విధిస్తూ జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు చెప్పారు. గతంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ సదరు ఇట్టిగా ప్రాపర్టీస్ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాము ఖానామెట్ పరిధిలో 15 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని, అందువల్ల ఆ భూమిపై తమకే హక్కులు ఉన్నాయని సదరు సంస్థ వాదించింది. వెలుగులోకి రెవెన్యూ అధికారుల లీలలు.. సీఐడీ దర్యాప్తునకు ఆదేశంకోర్టు విచారణలో ఈ భూమికి సంబంధించిన విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. వాస్తవానికి ఖానామెట్‌లోని సదరు 15 ఎకరాల భూమిని ప్రభుత్వం 1997లోనే టీజీఐఐసీ కి కేటాయించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమికి నకిలీ పట్టాలు ఎలా సృష్టించారనే కోణంలో న్యాయస్థానం లోతుగా పరిశీలించింది. ఈ నకిలీ పట్టాల వెనుక కొందరు రెవెన్యూ అధికారుల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవడంతో, వారి పాత్రపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ చేత పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించాలని హైకోర్టు ఆదేశించింది.నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలి: ఈ ల్యాండ్ స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారుల గుట్టు రట్టు చేయాలని స్పష్టం చేసిన జస్టిస్ నగేశ్ భీమపాక.. రాబోయే నాలుగు వారాల్లోగా (నెల రోజుల్లో) దర్యాప్తునకు సంబంధించిన సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించాలని సిట్ మరియు సీఐడీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని, నకిలీ రికార్డులు సృష్టించే భూమాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిందేనని ఈ తీర్పు ద్వారా హైకోర్టు స్పష్టం చేసింది.

# భాగ్యనగరంలో వరుణుడి ఉగ్రరూపం

**హైదరాబాద్, జూన్ 9 (వుదయం):**



గత కొన్ని రోజులుగా తీవ్ర ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడిపోతున్న నగర ప్రజలకు వరుణుడు చల్లని కబురు అందించాడు. మంగళవారం సాయంత్రం నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ జోరువానతో నగర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో ప్రజలు సేదతీరారు. అయితే, ఒక్కసారిగా పడిన భారీ వర్షం కారణంగా నగరంలోని ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించాయి.

**ఐటీ కారిడార్ టూ పాతబస్తీ.. అంతటా దంచికొట్టిన వాన**

నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ వర్షం బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, ప్రగతినగర్, మియాపూర్, లింగంపల్లి, హైటెక్‌సిటీ, చందానగర్ ప్రాంతాల్లో రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. మరోవైపు నగర కేంద్ర భాగాలైన ముషీరాబాద్, లక్డికాపూల్, చంపాపేట్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్‌బండ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్‌లింగంపల్లి, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం పడటంతో పలు చోట్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈదురుగాలుల బీభత్సం.. నేలకొరిగిన చెట్లు భారీ వర్షంతో పాటు ముంచెత్తిన ఈదురుగాలుల ధాటికి నగరంలో పలుచోట్ల ఆస్తి నష్టం సంభవించింది.



# ఎనుమాముల ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్ జిల్లా జూన్ 09 (వుదయం ప్రతినిధి) : వరంగల్ ఏనుమాముల మార్కెట్లోని ఈవీఎం గోదాముల్లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద త్రైమాసిక తనిఖీ షెడ్యూల్లో భాగంగా మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డ్లోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను పరిశీలించారు. గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణపై పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ మరియు ఎన్నికల విభాగ డిటి రంజిత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

**-జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు**
**-జీరో అడ్మిషన్ల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**-బడి తెరిచేలోగా అన్ని మౌలిక వసతులు కల్పించాలి**
**-చిన్నబోయినపల్లి స్కూల్ స్ఫూర్తిదాయకం : కానిస్టేబుల్ సతీష్, సర్పంచ్‌కు సత్కారం**



ములుగు, జూన్ 09 (వుదయం ప్రతినిధి) : జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలను (అడ్మిషన్లు) కనీసం 10 శాతం మేర పెంచాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యాశాఖల అధికారులతో కలిసి 2026-27 విద్యా సంవత్సర ఏర్పాట్లు, 'బడిబాట' కార్యక్రమంపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అడ్మిషన్లు లేని (జీరో) పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గ్రామాల్లోని బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మౌలిక వసతుల కల్పన: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపే తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్, శానిటేషన్ వంటి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల్లో ప్రాథమిక చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పెంపొందించడానికి ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఖీంచీ) మిషన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి. నిఘా - చర్యలు, అధికారులు పాఠశాలలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. చిన్నబోయినపల్లి పాఠశాల ఆదర్శం విద్యార్థుల సంఖ్య 12 నుంచి 120 కి పైగా పెరిగేలా కృషి చేసిన చిన్నబోయినపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని, ఇందుకు ప్రత్యేక శ్రమించిన కానిస్టేబుల్ ధూపాటి సతీష్, గ్రామ సర్పంచ్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఈ పాఠశాల జిల్లాకే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి (ణజూ) ఏ. సిద్ధార్థ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె. మల్లేశం, ఐవీనూ గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, ణ×జూ, మండలాల వీజూలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతకు మరో అడుగు

**రాయపర్తి మండల మహిళా సంఘం బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**
**స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అండ**
**మహిళల ఆర్థిక అభివృద్ధికి కొత్త ఊపు**



రాయపర్తి జూన్ 9 (వుదయం ప్రతినిధి):మహిళా సంఘాల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేర్కొన్నారు. రాయపర్తి మండల మహిళా సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన బస్సును ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఘనంగా ప్రారంభించి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని, స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. మహిళా సంఘాలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో బస్సు కొనుగోలు చేయడం మహిళల ఐక్యతకు, పట్టుదలకు నిదర్శనమని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ బస్సు ద్వారా మహిళా సంఘానికి ఆదాయం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, , పార్టీ నాయకులు పాల్గొన్నారు. మహిళా సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు.

# ఈవిఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జూన్ 09(వుదయం జిల్లా ప్రతినిధి): జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం, వివి ఫ్యాట్ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు మరియు వీవీపాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు.గోదాంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, అగ్ని మాపక పరికరాలు, డబుల్ లాక్ సిస్టమ్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్‌లను తనిఖీ చేసి, ఎన్నికల సంగం సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత మరియు నిష్పాక్షికత కోసం ఈవిఎంల, వివి ఫ్యాట్ ల భద్రత అత్యంత కీలకమని ఎన్నికల సంగం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయనున్నామని తెలిపారు. గోదాంలో ఉన్న అన్ని యంత్రాలు సక్రమంగా భద్రపరచబడి ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకాలు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తాళం వేసి సీల్ వేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లబెల్లి మండల 'ఎస్సీ సెల్' అధ్యక్షుడిగా పరికి పవన్ ఏకగ్రీవ ఎన్నిక



నల్లబెల్లి, జూన్ 09 (వుదయం ప్రతినిధి) : నల్లబెల్లి మండల ఎస్సీ సెల్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్ అధ్యక్షతన ఈ నియామక ప్రక్రియ నిర్వహించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నల్లబెల్లి కేంద్రానికి చెందిన పరికి పవన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఉపాధ్యక్షులు గంధం కుమార్, నత్తి చిరంజీవి, కానుగంటి రాజు.ప్రధాన కార్యదర్శి కలకోటి స్వామి.కార్యదర్శులు ఎర్ర శివ, ములుగు సుభాష్. కోశాధికారి. జిల్లా కమిటీ ప్రతినిధులుగా దండెం రవీందర్, బోట్ల నరేష్, బాడిశ కుమారస్వామి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, దళిత సంక్షేమానికి శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు ఎర్రబెల్లి రఘుపతిరావు. పురుషోత్తం సురేష్. మాసం పెల్లి అఖిల్ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వివిధ గ్రామాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మూతపడ్డ ప్రభుత్వ పాఠశాలలు ఈ సంవత్సరమైనా తెరుసుకునేనా

**బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వల్లెపు శ్రీనివాస్**




ఖానాపురం, జూన్ 9 (వుదయం ప్రతినిధి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని మూతపడ్డ పాఠశాలలు ఈ సంవత్సరమైనా తెరుసుకునేనా అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వల్లెపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని విద్యాశాఖను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని 42 ప్రభుత్వ పాఠశాల ఉండగా అందులో 9 ప్రభుత్వ పాఠశాలలు వివిధ కారణాలతో మూతపడ్డాయని తెలుపుతూ, మూతపడ్డ పాఠశాలను ఈ సంవత్సరమైన తెరుసుకునేలా ప్రయత్నాలు చేపడుతున్నారా లేదా అని ప్రభుత్వాన్ని విద్యాశాఖ అధికారులను ఆయా గ్రామాల పిల్లల తల్లిదండ్రుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ తరపున తెలుపుతున్నట్లు తెలుపుతూ, తక్షణమే మూతపడ్డ పాఠశాలను తెరిపించె ప్రయత్నం చేసి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తే ఆయా గ్రామాల పిల్లల తల్లిదండ్రులు పిల్లలను ఆయా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే ఆలోచన చేస్తారోనని ప్రభుత్వానికి విద్యాశాఖకు ఆయన తెలిపారు.

# ముస్లిం న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ అంకూస్ నియామకం



ములుగు, జూన్ 09 (వుదయం ప్రతినిధి) : ములుగు జిల్లా ముస్లిం న్యాయ వేదిక అధ్యక్షుడిగా ములుగు మండలం కాసిందేవిపేట గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ నాయకులు మహమ్మద్ అంకూస్ నియమితులయ్యారు. ముస్లింల ప్రజాభిప్రాయం ప్రకారం, సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యాసిన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ రఫతుల్లా సిఫారసుల మేరకు ఈ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, సమాజంలో మంచి పలుకుబడి ఉన్న మహమ్మద్ అంకూస్.. ఇంతకాలం వివిధ రాజకీయ పార్టీల బలోపేతానికి తన అమూల్యమైన సమయాన్ని కేటాయించారు. ప్రస్తుత తరుణంలో ముస్లింల ఐక్యత, జనాభా దామాషా ప్రకారం వారి హక్కుల సాధన కోసం పోరాడాలని ఆయన నిర్ణయించుకున్నారు. మైనారిటీలపై జరుగుతున్న వివక్షను రూపమాపి, సామాజిక న్యాయం కోసం సంఘ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.?ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యాసిన్ మాట్లాడుతూ.. ముస్లిం జాతిని బలోపేతం చేయాలనే సంకల్పంతో ఉన్న అంకూస్ గారిని జిల్లా అధ్యక్షుడిగా నియమించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.హక్కుల సాధనే నా ధ్యేయం అని మహమ్మద్ అంకూస్ అన్నారు. తన నియామకంపై ములుగు జిల్లా నూతన అధ్యక్షుడు మహమ్మద్ అంకూస్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ముస్లింలందరినీ ఏకం చేసి, వారి హక్కుల రక్షణకు, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# రోడ్డు ప్రమాద భీమా చెక్ ను అందజేసిన సీపీ




వరంగల్ క్రైం, జూన్ 09 (వుదయం ప్రతినిధి) : రోడ్డు ప్రమాదం మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా మంగళవారం ప్రమాద బీమా చెక్ ను అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏ. ఆర్. కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఆర్. సతీష్ గత సంవత్సరం మే 15వ తారీకు స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించాడు. దీనితో మరణించిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా 5లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి అందాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందజేయాలని సీపీ అధికారులను ఆదేశించారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి




నర్సంపేట జూన్ 09 (వుదయం ప్రతినిధి) : రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శివానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్త నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను సమయానికి పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, పాఠశాల ఆవరణలో పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు నిర్వహిస్తున్న విద్యాసంస్థల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది, మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసి ప్రతి పాఠశాల తమ ఫీజుల వివరాలను నోటీసు బోర్డుపై ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఇరవై ఐదు శాతం ఉచిత సీట్లు కల్పించాలని కోరారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడుస్తున్న పాఠశాలలను వెంటనే మూసివేయాలని, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మార్త నాగరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి కాలేపెల్లి రాకేష్‌తో పాటు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# నాగుర్లపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం ప్రారంభించిన 16 వార్డ్ కౌన్సిలర్ నవీన్ నాయక్



నర్సంపేట జూన్ 09 (వుదయం ప్రతినిధి) : నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు నాగుర్లపల్లి గ్రామంలో మంగళ వారం ఉచిత పశువైద్య మరియు గొంతువాపు (దొబ్బ రోగం) నివారణ టీకాల పంపిణీ శిబిరం నిర్వహించినారు. నర్సంపేట మండలం ప్రాథమిక పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి 16వ వార్డు కౌన్సిలర్ బానోత్ నవీన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బానోత్ నవీన్ నాయక్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపైనే రైతుల ఆర్థిక భద్రత ఆధారపడి ఉంటుందని, ఇలాంటి ఉచిత శిబిరాలను నాగుర్లపల్లి గ్రామ రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. ఆర్. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభంలో పశువులకు గొంతువాపు (దొబ్బ రోగం) సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా పశువులను ఈ వ్యాధి బారి నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. శిబిరంలో భాగంగా గ్రామంలోని ఆవులు, గేదెలకు ఉచితంగా టీకాలు వేయడంతో పాటు, జ్వరం, మేత తినకపోవడం, పాల ఉత్పత్తి తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్న పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, గ్రామ రైతులు, పశుపోషకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ పశువులకు టీకాలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డీజీపీని కలిసిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి




రాయపర్తి జూన్ 9 (వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అత్యున్నత అధికారి, సి.వి ఆనంద్ ను ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరు పాటి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ భేటీలో శ్రీనివాస్ రెడ్డి డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జ్ఞాపికను బహూకరించి, ఆయన నాయకత్వంలో తెలంగాణ పోలీసు శాఖ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తూ రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో విశిష్ట విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ సీ.వి. ఆనంద్ ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. సమాజ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న ఫౌండేషన్ సేవలు ఆదర్శప్రాయమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ప్రజా సేవలో మరింత చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక బాధ్యతల నిర్వహణ, సేవా కార్యక్రమాల అమలులో ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. డీజీపీతో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ సంస్థకు మరింత ప్రోత్సాహాన్ని అందించిందని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి మరింత మంది ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు.

# కాళేశ్వరం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా విస్తృత సమావేశం



మహాదేవపూర్ జూన్ 09(వుదయం ప్రతినిధి) : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ సంక్షేమ పథకాల సాధన కోసం సంఘం బలోపేతమే ధ్యేయంగా (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాళేశ్వరంలో జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్‌కార్డు సభ్యుడు సామల శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకణాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు.జర్నలిస్టుల సంక్షేమం, హెల్త్‌కార్డుల జారీ, ఇళ్ల స్థలాల కేటాయింపు, జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ అమలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని, రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ప్రతి జర్నలిస్టుకు అందేలా సంఘం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల సాధనలో టీయూడబ్ల్యూజే చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రతి పాత్రికేయుడు సంఘంతో అనుబంధం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సంఘం బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకమని పేర్కొంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ సభ్యత్వాలు నమోదు చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ నెల 29న భూపాలపల్లిలో నిర్వహించనున్న జిల్లా మాససభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు సట్ల మురళి, ఎంఎల్ఎన్ మూర్తి, శ్రీశైలం, ప్రవీణ్‌కుమార్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, మీర్జా ముబీన్ , టేమ్జ్ అధ్యక్షుడు సాంబయ్య, రజనీకాంత్, హైదర్, రామగుండం రాజేంద్రప్రసాద్, శశాంక్, మజీద్, శ్రీనివాస్, చిటికేసి శ్రీనివాస్, నాగరాజు, జిల్లాలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమ సాధన దిశగా ఈ సమావేశం ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.



# గ్రేటర్ హైదరాబాద్



## అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

**- అభినందించిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**రామచంద్రపురం జూన్ 9**

భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీకి చెందిన కుమారి భవాని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు.ఇండియా-థాయిలాండ్ టెస్ట్ సిరీస్ మెన్ & ఉమెన్ 2025-26 బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఆసియా ఆధ్వర్యంలో మార్చి 11 నుండి 15 వరకు థాయిలాండ్‌లోని బ్యాంకాక్, పట్టాయా నగరాల్లో నిర్వహించబడింది.ఈ పోటీల్లో కుమారి భవాని తన ప్రతిభ, క్రీడా స్ఫూర్తి మరియు అంకితభావంతో అద్భుత ప్రదర్శన చేసి విజేతగా నిలిచారు. ఆమె సాధించిన ఈ ఘన విజయం భారతి నగర్ డివిజన్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి గారు అభినందించారు.ఈ సందర్భంగా కుమారి భవానిని శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు రాణి యాదవ్ గారు పాల్గొన్నారు.



## లక్ష్మీపతి గూడెం ప్రధాన చౌరస్తాలో హై మస్ట్ లైట్లు ప్రారంభం



**జిన్నారం జూన్ 9**

**(వుదయం ప్రతినిధి)**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు లక్ష్మీపతి గూడెంలో సోమవారం రాత్రి మృగశిర కార్తె సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన హై మాస్టలైట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ తో కలిసి వార్డ్ కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ... వార్డులలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గ్రామ పెద్దలు యువకులు, పాల్గొన్నారు.

## అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా మోదీ.... గవర్నర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్**

దేశ చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. ఇది ప్రధాని నాయకత్వంపై దేశ ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు లోక్ భవన్ మంగళవారం సాయంత్రం పత్రికా ప్రకటన విడుదల చేస్తుంది .ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికాభివృద్ధి, డిజిటల్ విప్లవం, మౌలిక సదుపాయాల విస్తరణ, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెంపు వంటి రంగాల్లో విశేష పురోగతి సాధించిందని గవర్నర్ శివ ప్రతాప్ పేర్కొన్నార . జాతీయ ప్రయోజనాల పరిరక్షణలోనూ కేంద్ర ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందన్నారు.

'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధన దిశగా చేపడుతున్న కార్యక్రమాలు దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దనున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మరిన్ని విజయాలు సాధించి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు."తెలంగాణ ప్రజల తరపున ప్రధాని నరేంద్ర మోదీకి కాంక్షలు తెలియజేస్తున్నాను. ఆయన నాయకత్వంలో దేశం మరింత ప్రగతి, సుసంపన్నత సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రకటనలో పేర్కొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం..

**- 15 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన పటాన్చెరు ఎం ఎల్ ఎస్ పాయింట్ వే బ్రిడ్జి ప్రారంభం..**

**- అతి త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్ లోనూ వే బ్రిడ్జిలు ఏర్పాటు..**

**- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**పటాన్చెరు (వుదయం):**

రేషన్ డీలర్ల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. స్టాక్ పాయింట్లో ధాన్యం తూకం వేసే సమయంలో డీలర్లు నష్టపోవద్దన్న లక్ష్యంతో పటాన్చెరులోని ఎంఎల్ఎస్ పాయింట్ లో 15 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటుచేసిన వే బ్రిడ్జిను మంగళవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వయంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు కలిగిన రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. స్టాక్ పాయింట్లలో వే బ్రిడ్జి లేకపోవడం మూలంగా ధాన్యం ధూపం వేసే సమయంలో ప్రతిసారి నష్టపోతున్నామని గతంలో రేషన్ డీలర్లు తన దృష్టికి తీసుకునే రావడం జరిగిందని..వెంటనే సొంత నిధులు కేటాయించి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వాలు చేయాల్సిన పని తాను చేయడం జరిగిందని గుర్తు చేశారు. అతి త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్ స్టాక్ పాయింట్లలోనూ వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని డీలర్లు కోరగా.. వచ్చే రెండు వారాల్లో బ్రిడ్జి ల ఏర్పాటునకు శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రం లోని ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్లలో వే బ్రిడ్జి లు ఏర్పాటు చేసి రేషన్ డీలర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అతి త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రేషన్ డీలర్ల సంక్షేమం కోసం 15 లక్షల రూపాయలు సొంత నిధులతో వే బ్రిడ్జి ఏర్పాటు చేసిన ఘనత. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కే దక్కిందని డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు ప్రశంసించారు. తమ సంక్షేమం ఆర్థిక అభ్యున్నత కోసం అహర్నిశలు కృషి చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అనంతం, జిల్లా ఉపాధ్యక్షులు జయప్రకాష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, వెంకటేష్, ధనరాజ్ గౌడ్, రాజు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## సొంతూరికి చేరిన సాహసకిశోరం అనురూప్ రెడ్డి

**కవాడిపల్లి, రంగారెడ్డి జిల్లా**

అమెరికాలో ముగ్గురు స్నేహితులను కాపాడి అమరుడైన అనురూప్ రెడ్డి భౌతికకాయం స్వగ్రామానికి చేరిక: ఘన నివాళులర్పించిన ఎంపి చామల,ఎమ్మెల్యేలు..ప్రశంసా పత్రాన్ని పంపిన సీఎం రేవంత్ రెడ్డిరంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కవాడిపల్లి గ్రామానికి చెందిన కోదూరు అనురూప్ రెడ్డి భౌతికకాయం ఈరోజు (మంగళవారం) ఉదయం హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అమెరికాలోని లూసియానా టోరొడో పార్క్ (Toro Bayou Park) వద్ద సెబాన్ నదిలో ప్రమాదవశాత్తు మునిగిపోతున్న తన ముగ్గురు స్నేహితులను ప్రాణాలకు తెగించి కాపాడి, దురదృష్టవశాత్తు తాను వలలో చిక్కుకుని ప్రాణాలు విడిచిన అనురూప్ రెడ్డి (23) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రశంసా పత్రంస్నేహితుల ప్రాణాలు కాపాడేందుకు అత్యంత సాహసోపేతంగా ప్రాణత్యాగం చేసిన తెలంగాణ ముద్దుబిడ్డ అనురూప్ రెడ్డి వీరత్వాన్ని కొనియాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రత్యేకంగా ఒక అధికారిక ప్రశంసా పత్రాన్ని పంపారు.

ముఖ్యమంత్రి తన సందేశంలో... "కేవలం 23 ఏళ్ల వయసులోనే ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న అనురూప్, తోటి స్నేహితుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నప్పుడు ఏమాత్రం వెనుకాడకుండా నీటిలోకి దూకి వారిని రక్షించడం అతని నిరుపమాన ధైర్యానికి, మానవత్వానికి నిదర్శనం. అనురూప్ చేసిన ఈ పరమోన్నత త్యాగం యావత్ తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకం. అతని త్యాగం తెలంగాణ గడ్డపై చెరిగిపోని ముద్ర వేసింది" అని కొనియాడారు. ప్రభుత్వం మరియు తెలంగాణ ప్రజల తరపున అనురూప్ తల్లిదండ్రులకు, అతని సోదరుడు ఆశ్రిత్ రెడ్డికి, కుటుంబ సభ్యులకు సిఎం రేవంత్ రెడ్డి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్టసమయంలో ప్రభుత్వం కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చొరవ:*అనురూప్ రెడ్డి భౌతికకాయం త్వరగా తెలంగాణకు వచ్చేలా *భువనగిరి లోక్ సభ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి* ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇండియన్ ఎంబసీ, తెలంగాణ ఎన్.ఆర్.ఐ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి స్వయంగా మానిటరింగ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రోటోకాల్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని విమానాశ్రయం నుండి స్వగ్రామమైన కవాడిపల్లికి తరలించారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అనురూప్ రెడ్డి తల్లిదండ్రులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.*ఘన నివాళులర్పించిన ఎంపి ఎమ్మెల్యేలు:* స్వగ్రామానికి చేరుకున్న అనురూప్ రెడ్డి భౌతికకాయాన్ని *భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు* *ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు శ్రీ మల్లారెడ్డి రంగారెడ్డి గారు* మరియు *తుంగతుర్తి శాసన సభ్యులు శ్రీ మందుల సామేల్ గారు* సందర్శించి, పూలమాలలు వేసి అంజలి ఘటించారు. స్నేహితుల కోసం ప్రాణాలర్పించిన అనురూప్ ధైర్యాన్ని వారు అభినందించారు.ఈ అంత్యక్రియల కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకు లక్కీ డిప్

**- జిల్లా షెడ్యూల్డు అభివృద్ధి అధికారి నుషిత**

**గద్వాల జూన్ 09**

**(వుదయం కరస్పాండెంట్)**



2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నాన్‌రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పథకం కింద అందిన దరఖాస్తుల ఎంపికకు లక్కీ డిప్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1వ తరగతికి నాన్‌రెసిడెన్షియల్ విభాగంలో 57 సీట్లకు గాను (264) మరియు 5 తరగతిలో (రెసిడెన్షియల్) విభాగంలో 59 సీట్లకు గాను (310) దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అర్హుల ఎంపిక కోసం ఈ నెల 12వ తేదీన ఉదయం 11.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం (IDOC) లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ అధ్యక్షతన లక్కీ డిప్ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాల్సిందిగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి తెలిపారు.


**దక్షిణ మధ్య రైల్వే**

మమ్మల్ని ✕ @ SCRailwayIndia అనుసరించండి

ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

**ఇ-టెండరు ప్రకటన నం. C-SG-PT-IPMPLS-SC-NED-02, తేది.05.05.2026 కు సవరణ నం.2, తేది.05.06.2026**

PUB/350

భారత రాష్ట్రపతి తరపున Dy. CSTE/ Projects/ Tele/ SC వారు దిగువ తెలిపిన పని కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

**1. టెండరు నం. మరియు తేది:** C-SG-PT-IPMPLS-SC-NED-02, తేది: 05.05.2026, (సవరణ నం. 2, తేది:05.06.2026) **పని పేరు:** దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ మరియు నాందేడ్ డివిజన్లలో IP-MPLS ఏర్పాటు కొరకు టెలికమ్యూనికేషన్ పనులు. **అంచనా ప్రాజెక్ట్ వ్యయం:** రూ. 16,23,90,243.96. **బిడ్ సెక్యూరిటీ:** రూ. 32,47,800, **పని పూర్తి చేయు కాలం:** 12 నెలలు. **బిడ్ ముగింపు తేది (బిడ్ గడువు తేది):** 22.06.2026న 11.00 గం.లకు. **బిడ్ తెరుచు తేది:** 22.06.2026న 11.00 గం.ల తర్వాత, **ఆఫర్ చెల్లుబాటు:** బిడ్ ముగింపు తేదీ నుండి 120 రోజులు. **టెండరు బుక్‌లెట్ ధర:** రూ. 0/- **బిడ్ ముగింపు తేది పొడగింపుకు కారణం:** బిడ్డర్ల అభ్యర్థన మేర.

అన్ని బిడ్డింగ్‌లు ఇండియన్ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in లో ఉన్నవి. ఈ టెండరుపై మాన్యువల్ ఆఫర్లు అనుమ తించబడవు.

తదుపరి వివరాలను www.ireps.gov.in లో చూడవచ్చును.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికం ఇంజనీర్/ ప్రాజెక్ట్/ టెలి/ సికింద్రాబాద్

**ఇ-టెండరు ప్రకటన నం. C-SG-PT-IPMPLS- BZA-GTL-GNT-03, తేది.05.05.2026కు సవరణ నం.2, తేది.05.06.2026**

PUB/351

భారత రాష్ట్రపతి తరపున Dy. CSTE/ Projects/ Tele/ SC వారు దిగువ తెలిపిన పని కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

**1. టెండరు నం. మరియు తేది:** C-SG-PT-IPMPLS-BZA-GTL-GNT-03, తేది: 05.05.2026, (సవరణ నం. 2, తేది:05.06.2026) **పని పేరు:** దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ, గుంతకల్ మరియు గుంటూరు డివిజన్లలో IP-MPLS ఏర్పాటు కొరకు టెలికమ్యూనికేషన్ పనులు. **అంచనా ప్రాజెక్ట్ వ్యయం:** రూ. 31,18,34,709.27/- **బిడ్ సెక్యూరిటీ:** రూ. 62,36,700/- **పని పూర్తి చేయు కాలం:** 12 నెలలు. **బిడ్ ముగింపు తేది (బిడ్ గడువు తేది):** 22.06.2026న 11.00 గం.లకు. **బిడ్ తెరుచు తేది:** 22.06.2026న 11.00 గం.ల తర్వాత, **ఆఫర్ చెల్లుబాటు:** బిడ్ ముగింపు తేదీ నుండి 120 రోజులు. **టెండరు బుక్‌లెట్ ధర:** రూ. 0/- **బిడ్ ముగింపు తేది పొడగింపుకు కారణం:** బిడ్డర్ల అభ్యర్థన మేర.

అన్ని బిడ్డింగ్‌లు భారతీయ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in లో ఉన్నవి. ఈ టెండరుపై మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు.

తదుపరి వివరాలను www.ireps.gov.in లో చూడవచ్చును.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికం ఇంజనీర్/ A418 ప్రాజెక్ట్/ టెలి/ సికింద్రాబాద్

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.


## యాప్ ఆధారిత ఎరువుల విక్రయాలపై రైతుల ఆగ్రహం

**- రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వ విధానం వెంటనే ఉపసంహరించాలి: ఎన్ను గోవర్ధన్ రెడ్డి**

**చేవెళ్ల, జూన్ 09 (వుదయం)**

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన కీలక సమయంలో రైతులకు అవసరమైన ఎరువులు అందకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్ ఆధారిత విధానం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన రైతు నాయకుడు ఎన్ను గోవర్ధన్ రెడ్డి విమర్శించారు.ఫర్టిలైజర్ దుకాణాలు, గోదాముల్లో ఎరువులు సమృద్ధిగా నిల్వ ఉన్నప్పటికీ రైతుల చేతికి మాత్రం ఒక్క సంచి కూడా సులభంగా అందని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా యాప్‌లో బుకింగ్ చేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.యాప్ డౌన్‌లోడ్ కావడంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, డౌన్‌లోడ్ అయినా ఎకరానికి ఒక్క బస్తా మాత్రమే ఇస్తామని చెప్పడం రైతులకు అన్యాయమని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరానికి ఒక బస్తా ఎరువు ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు.ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌లు లేని చిన్న, సన్నకారు రైతులు ఎరువులు పొందలేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం రైతులకు సహకరించాల్సిన సమయంలో ఇలాంటి నిబంధనలతో ఇబ్బందులకు గురిచేయడం సరైన విధానం కాదని గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. యాప్ విధానం కారణంగా ఫర్టిలైజర్ దుకాణదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని, యాప్ లేకుండా ఒక్క బస్తా కూడా విక్రయించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.రైతుల అవసరాలు, వ్యవసాయ పనుల అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని యాప్ ఆధారిత ఎరువుల విక్రయ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత విధానంలో ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే రైతుల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరించాలని, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాలను పునఃసమీక్షించాలని ఆయన కోరారు.ముఖ్యాంశాలుయాప్ ఆధారిత ఎరువుల విక్రయాలపై రైతుల అసంతృప్తిగోదాముల్లో నిల్వలు ఉన్నా రైతులకు అందని ఎరువులుస్మార్ట్‌ఫోన్ లేని రైతులకు తీవ్ర ఇబ్బందులుఎకరానికి ఒక్క బస్తా నిబంధనపై ఆగ్రహంవెంటనే యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో భారీ ఆందోళనలకు హెచ్చరిక

## ఇంధన ధరల పెంపుపై మహిళా కాంగ్రెస్ 'మహా నిరసన ర్యాలీ'




**కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ**

**హైదరాబాద్, జూన్ 09**

**(వుదయం ప్రతినిధి) :**

గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో మంగళవారం రోజున గాంధీ భవన్ నుండి గన్ పార్క్ వరకు 'మహా నిరసన ర్యాలీ' నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూసామాన్యులపై భారం, ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను ఏకంగా నాలుగు సార్లు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్ నెపంతో ఒకే నెలలో పలుమార్లు ఇంధన ధరలు పెంచడం దుర్మార్గమన్నారు.కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ..: కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న అధిక ఎక్సైజ్ డ్యూటీ వల్లే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, బడా కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే పేద ప్రజల రక్తాన్ని పిండుతున్నారని విమర్శించారు.మహిళల వంటింటి బడ్జెట్ పై, ఇంధన ధరల పెంపు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయి, మహిళల వంటింటి బడ్జెట్ అస్తవ్యస్తమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో సిలిండర్ ధర తక్కువగా ఉన్నప్పుడే రోడ్లపైకి వచ్చి నాటకాలు ఆడిన బీజేపీ నాయకులు, ఇప్పుడు ధరలు వెయ్యి రూపాయలు దాటినా నోరు మెదపకపోవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'మహాలక్ష్మి పథకం' ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెడుతుంటే, కేంద్రం మాత్రం ధరలు పెంచుతూ వేధిస్తోందని ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో మహిళా శక్తి ఏంటో చూపిస్తూ దేశ వ్యాప్త పోరాటాలను ఉధృతం చేస్తామని ఎర్రబెల్లి స్వర్ణ హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కార్యవర్గ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిన్నారం తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన ఆంథోనీ



**జిన్నారం జూన్ 9**

**(వుదయం ప్రతినిధి)**

జిన్నారం మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని నూతన తహశీల్దార్ ఆంథోనీ అన్నారు. సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన ఆయన జిన్నారం తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించారు. గత తహశీల్దార్ దేవదాస్ ఆర్డీవోగా పదోన్నతి పొంది నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాసిల్దారుగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆంటోనీకి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానన్నారు. కాగా నూతన తాసిల్దార్ పలువురు మండల ప్రజా ప్రతినిధులు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామీణ పేదలకు ఆదాయం పెంచడానికే... బీజేపీ

**వికారాబాద్, జూన్ 09;**

**(వుదయం బొంరాస్ పేట ప్రతినిధి):**



బొంరాస్ పేట: గ్రామీణ పేదలకు మరింత ఆదాయం పెంచడానికే మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం "వికసిత్ భారత్ జీ రామ్ జీ"పథకాన్ని అమలు చేస్తున్నదని భాజాపా మండల అధ్యక్షుడు జగదీష్ సాగర్ తెలిపారు. మంగళ వారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామ పాత చెరువు దగ్గర ఆ పథకం ద్వారా చేపట్టిన పనులను అక్కడ కూలీల కోసమై ఏర్పాటు చేసిన వసతులను మండల ముఖ్య నేతలు మరియు కార్యకర్తలతో కలసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న రైతులకు కూలీలకు వేసవి తాపం నుండి ఊరట చెందడానికి మజ్జిగ పాకెట్లు బారాస శ్రేణులు పంపిణీ చేశారు.అనంతరం వారికి కేంద్ర ప్రభుత్వం సవరణ చేసి అమలు చేస్తున్న వికసిత భారత్ జీ రాం జీ పథకం గురించి ఆ పార్టీ మండల అధ్యక్షుడు అవగాహన కల్పించాడు.ప్రతి గ్రామీణ పేదరిక కుటుంబానికి పని దినాలు పెంచి సంవత్సరానికి 100 రోజుల నుండి 125 రోజుల పనికి హామీ , డిజిటల్ హాజరు, వేగవంతం గా వేతనాల చెల్లింపు,పని కోరిన పదిహేను రోజుల్లో పని కల్పించక పోతే వారికి ఉపాధి భృతి ఇలా పథకం ద్వారా చేకూరే లబ్ధి గురించి ఆయన వారికి అవగాహన కల్పిస్తూ,ప్రతి పేద కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భనలో మండల బారాస మాజీ అధ్యక్షుడు చాకలి నర్సింలు, ఉప్పు జగదీశ్వర్, రాజారాం రెడ్డి, గణేష్నాయక్, దప్పు జనార్ధన్, పుట్టి శ్రీనివాస్, సతీష్, నారాయణ గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ చేయించాలి వాహనాలకు ఉన్న ఎల్ ఈ డి బల్బులను తొలగిస్తాం

**-- ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలి**

**--నారాయణపేట ఆర్టీవో షేక్ మున్ని**

**నారాయణపేట జూన్09**

**(వుదయం ప్రతినిధి)**




నారాయణపేట జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వారి పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ చేయించాలని నారాయణపేట ఆర్టీవో షేక్ ముని అన్నారు. నారాయణపేట ఆర్టీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15న పాఠశాలల పున ప్రారంభం సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలలో ఉన్న బస్సులకు యజమానులు పూర్తి ఫిట్నెస్ చేయించుకోవాలని లేదంటే ఆ పాఠశాల బస్సులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, శిక్షణ పొందిన డ్రైవర్లతో బస్సులను నడపాలని లేదంటే వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటాం అన్నారు. యజమానులు వెంటనే స్పందించి ఆర్టీవో కార్యాలయానికి వారి బస్సులను తీసుకువచ్చి ఫిట్నెస్ చేయించుకోవాలని సూచించారు. ఫిట్నెస్ సర్టిఫికేట్ లేనిదే పాఠశాలల బస్సులు నుండి వచ్చే వారికి తీవ్ర ఇబ్బంది అవుతుందని వెంటనే వాటిని తొలగించాలని ఇది చట్టరీత్యా నేరమని ఆమె సూచించారు.కాగా ఎల్ఈడి బల్బులు, డబుల్ సైలెన్సర్ ఉన్న వాహనాలను తనిఖీ చేసి వాటిని సైతం సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాకాలము సందర్భంగా ప్రయాణికులతో వివిధ గ్రామాలకు వెళ్లే ఆటోలు చెట్ల కింద ఆపరాదని ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని దీనిని దృష్టిలో ఉంచుకొని ఆటో యజమానులు, డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో 80 శాతం వాహనాలకు చాలానాలు విధించారని వాటిని నేటి వరకు చెల్లించలేదని వారు వెంటనే మీ సేవల ద్వారా చెల్లించి వాహనాలను నడుపుకోవాలని అన్నారు.లేదంటే వారి వాహనాలపై దాడులు నిర్వహించి సీజ్ చేస్తామని వెంటనే ఆన్లైన్ ద్వారా చెల్లించి వాటికి సంబంధించిన రసీదులను పొందాలన్నారు. కాగా పొలం పనులు ప్రారంభం అవుతున్న సందర్భంగా వివిధ ట్రాక్టర్ల యజమానులు సైతం చాలానాలు చెల్లించలేదని వారికి వెంటనే నోటీసులు పంపిస్తామని సూచించారు. లేదంటే మీ సేవ ద్వారా చాలానాలు చెల్లించి వాటికి సంబంధించిన రసీదులను పొందాలన్నారు. చాలానాలు చెల్లించని ట్రాక్టర్లు రోడ్డుపై కనిపిస్తే వాటిని సీజ్ చేస్తామని ఇది యజమానులు గమనించాలన్నారు. మైనర్ల తల్లిదండ్రులు చిన్నారులకు చక్ర వాహనాలను ఇవ్వరాదని వారు సరిగా నడపని వేల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ , కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించి డ్రైవింగ్ చేసి సురక్షితంగా ప్రయాణించి గమ్యాలకు చేరుకోవాలని ఆర్టీవో షేక్ మున్ని పలు సలహాలు సూచనలు ఇచ్చారు.

## మహానేత పుట్టపాగ మహేంద్రనాథ్‌కు శతజయంతి నివాళి

**- నేడు నాగర్ కర్నూల్ లో ఘన ఉత్సవం**

**నాగర్ కర్నూల్, జూన్ 09**

**(వుదయం బ్యూరో)**



ప్రజల కోసం జీవించిన మహానేత, మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ శతజయంతి ఉత్సవాలు నేడు జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఉదయం 10 గంటలకు జరుగనున్నాయి. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, సమాజానికి సేవ చేసిన ప్రముఖ వృద్ధులు, సామాజిక సేవకులు, వివిధ రంగాల్లో రాణించిన ప్రముఖులను పుట్టపాగ మహేంద్రనాథ్ స్మారకార్థం ఘనంగా సన్మానించనున్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కుచూకుల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననుండగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సి. ఖాసీమ్ అధ్యక్షత వహిస్తారు. "మహేంద్రనాథ్ గారి ఆశయాలకు మనమందరం వారసులం. ఆయన అభిమానులు, మేధావులు, ప్రజలంతా అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి" అని ఉత్సవాల కమిటీ కన్వీనర్ పుట్టపాగ శ్రీనివాసులు మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు


**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE-CUM VI JMFC: MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT:MEDIPALLY**

**O.S.NO. 370 of 2026**

**BETWEEN :**

Arravalli Bikshapathi and Another ...Plaintiffs

**AND**

1. The Tahsildar, Uppal Mandal,
2. All Concerned ....DEFENDANT No.1 ...DEFENDANT No.2

To

ALL CONCERNED

Please take notice that the Plaintiffs herein filed the above suit against Tahsildar Abdullapurmet Mandal and All concerned for Declaration to declare the Plaintiffs as the legal heirs of Late Arravalli Lingaiah@Avusala Lingaiah. The above case is posted to 07-08-2026 for your appearance. Therefore, the general public hereby informed that if anybody having objections you may appear before the Hon'ble Prl. Junior Civil Judge At: Medipally Court on 07-08-2026 at 10.30 A.M either in person or through an Advocate, otherwise, the matter will be decided in your absence as exparte.

**(BY ORDER OF THE HONOURABLE COURT)**

Sd/-

**E. MALLESH**

**Advocate**

**#3-163, Near Registration office, Pedda Amberpet, AbdullapurmeMandal, Ranga Reddy District. Counsel for the Plaintiffs.**



“స్త్రీలపై వేధింపులు కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదని.. మొత్తం సమాజానికి సంబంధించిన సమస్యని విజయ్ పేర్కొన్నారు. మహిళలపై నేరాలను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై నేరాలకు మాదకద్రవ్యాల వ్యాప్తికి సంబంధం ఉందన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారే ఎక్కువగా ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థినులు, ఉద్యోగాలు చేసే మహిళల భద్రత కోసం సింగపెన్ బృందం రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్‌లను మోహరిస్తుందని తెలిపారు. వాటి సహాయంతో ఎక్కడ ఎవరు మహిళలను వేధించినా తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు”

- తమిళనాడు సీఎం విజయ్

## వే'మన' పద్యం

గంగిగోవుపాలు గరిటెడైనను చాలు
కడివెడైన నేమి ఖరము పాలు
భక్తి గలుగు కూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినుర వేమా!



# ఘుమఘుమల వెనుక అపార ఔషధ గనులు

మన వంటగది నుంచి వచ్చే మసాలా వాసనను బట్టే అక్కడ ఏం వంటకం జరుగుతుందో, అది ఎంత రుచిగా ఉండబోతోందో చెప్పేయవచ్చు. భారతీయ వంటకాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత మన మూలికలు, సుగంధ ద్రవ్యాలదే (మసాలా దినుసులు). వంటకు అద్భుతమైన రుచిని, రంగును అద్దడమే కాకుండా.. మానవ శరీరానికి అవసరమైన అపారమైన ఔషధ విలువలను ఇవి అందిస్తున్నాయి. మనం నిత్యం వాడుకునే అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, పసుపు, మిరియాలు, లవంగాలు వంటి సుగంధ ద్రవ్యాల ప్రాధాన్యతను, వాటి ఆరోగ్య ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఏటా జూన్ 10వ తేదీని “జాతీయ మూలికలు, సుగంధ ద్రవ్యాల దినోత్సవం”గా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రపంచ సుగంధాల తోట 'కేరళ'.. గ్లోబల్ లీడర్‌గా భారత్!

సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి, వినియోగం, అంతర్జాతీయ ఎగుమతుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. మన దేశంలో దాదాపు 41కి పైగా విభిన్న రకాల మసాలా దినుసులు పండుతున్నాయి. చైనా, వియత్నాం వంటి దేశాలు ఈ రంగంలో మన తర్వాత స్థానాల్లో నిలిచాయి.

భారతదేశంలో ముఖ్యంగా కేరళ రాష్ట్రాన్ని “ప్రపంచ సుగంధ ద్రవ్యాల తోట (గార్డెన్ ఆఫ్ స్పైసెస్)” అని పిలుస్తారు. కేరళలోని ఇడుక్కి, వాయనాడ్, కొట్టాయం వంటి ఎత్తైన కొండ ప్రాంతాలు యాలకులు, నల్ల మిరియాలు, దాల్చిన చెక్క, లవంగాలు, జాజికాయ, జాపత్రి, పసుపు, అల్లం వంటి పంటలకు ప్రసిద్ధి చెందాయి. కేవలం వంట సామాగ్రి మాత్రమే కాకుండా, ఆయుర్వేదంలో అత్యంత కీలకమైన అశ్వగంధ, త్రిఫల, బ్రాహ్మి వంటి శ్రేష్ఠమైన మూలికలు కూడా ఇక్కడ విస్తారంగా లభిస్తాయి.

వేల ఏండ్ల నాటి చారిత్రక వైభవం..నాడే మొదలైన మసాలా వాణిజ్యం

భారతీయ సుగంధ ద్రవ్యాల చరిత్ర నిన్న మొన్నటిది కాదు, ఇది వేల సంవత్సరాల నాటి ప్రాచీన నాగరికతలతో ముడిపడి ఉంది. క్రీస్తు పూర్వమే రోమన్లు, ఈజిప్షియన్లు, అరబ్బులు భారతీయ మసాలా దినుసుల కోసం సముద్ర మార్గాల ద్వారా ఇక్కడికి వచ్చేవారు. నల్ల మిరియాలను ఆ రోజుల్లో "నల్ల బంగారం" (Black Gold) గా పిలిచేవారు. ఐరోపా దేశాలు భారతదేశానికి కొత్త సముద్ర మార్గాలను అన్వేషించడానికి, ఇక్కడ వలస పాలన స్థాపించడానికి కూడా ఈ సుగంధ ద్రవ్యాల వ్యాపారమే ప్రధాన కారణమంటే మన సంపద విలువ ఎంతో అర్థం చేసుకోవచ్చు.

కరోనా వేళ ప్రాణదాతగా నిలిచిన 'భారతీయ కషాయం'

గతంలో ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి సమయంలో, భారతీయ సాంప్రదాయ జీవన విధానం, వంటకాల్లోని గొప్పతనం ప్రపంచానికి తెలిసొచ్చింది. రోగనిరోధక శక్తి (Immunity) తక్కువగా ఉన్న దేశాలు వైరస్ ధాటికి విలవిల్లాడితే, భారతీయులు తమ వంటింట్లోని పసుపు, మిరియాలు, లవంగాలు, దాల్చినచెక్క, తులసితో చేసుకున్న 'కషాయాలు' తాగి వైరస్‌ను ఎదుర్కొన్నారు. మన నిత్య జీవితంలో అవిభాజ్యమైన ఈ మసాలాలే మనల్ని పటిష్టమైన అంతర్గత రక్షణ వ్యవస్థతో కాపాడాయని అంతర్జాతీయ ఆరోగ్య విశ్లేషకులు సైతం అంగీకరించారు.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి బాల గోపాల్



పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. . మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలుగా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్‌డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకుడిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యాడు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకుపోయిన నాయకుడాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్‌యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచు కున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్‌సిలో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్‌సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు ( ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసుల తో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90 వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్య హింసతోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిం చారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి. మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శిం చడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్‌లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్‌ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారత దేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐమావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్య కలాపాలను విస్తరిం చాడు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు, బహిర్గతం చేశాడు. బాల గోపాల్ దాదాపు ఒక దశాబ్దం క్రితం న్యాయశాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు. పోలీసులు హత్యలను ఎదుర్కో వటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు. ఎన్‌కౌంట ర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యానేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పనిసరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన అక్టోబర్ 8, 2009 రాత్రి హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో గుండెపోటుతో మరణించాడు.



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# బాల్‌పాయింట్ పెన్ విద్యా వ్యాప్తికి ఓ అద్భుత వరం




పలక, బలపంతో అక్షరాలు దిద్దిన తర్వాత పెన్ను పట్టుకునే అర్హత వస్తుంది మనందరికీ. బలపం రాతలను చెరప వచ్చేమోగాని పెన్నుతో రాసిన రాతల్ని కొట్టి వేయవచ్చు కాని అసలే చెప్పలేం. అలా అక్షరాభ్యాసం నుంచి అంతిమ గడియల వరకు మన జేబుకు ఓ అలంకారమై, మనకు తెలియకుండానే మన గౌరవాన్ని పెంచుతోంది విలువైన మన ఆత్మీయ నేస్తమైన పెన్ను లేదా కలం. నాటి పాళీ ఇంకు పెన్ను అంతరించి నేడు బాల్ పాయింట్ పెన్ను రాజ్యమేలుతోంది. అలా రాయడానికి నేడు అందుబాటులో ఉన్న ఏకైక ఉత్తమ సాధనం “బాల్‌పాయింట్” పెన్ లేదా “బాల్ పెన్” అని మనకు తెలుసు. చిన్నారి నుంచి పండు ముసలి వరకు అందరి హస్త భూషణం బాల్ పెన్. బాల్ పెన్‌ను చూడని, స్పర్శించని వారు ఉంటారా ! విద్యా బోధన, విద్యావంతుల జేబు భూషణం, వ్యాపార గణాంకాల పునాది, సమాచార వితరణశీలి పెన్ను మాత్రమే. నేడు ప్రపంచవ్యాప్తంగా పెన్ను అంటేనే బాల్‌పాయింట్ పెన్ అనేది నిర్వివాదాంశం. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా మన ఇంటి నేస్తం అయ్యింది బాల్ పెన్ను. గతంలో ఇంకులో ముంచి రాసుకునే పన్నులు, సిరా నింపి రాసుకునే పన్నులను చూసాం. నేడు ఇంకా పెన్ను అంతరించిపోయింది. బాల్‌పాయింట్ పెన్ను మన నిత్య నేస్తం అయ్యింది.

జాతీయ బాల్‌పాయించ్ పెన్ దినోత్సవం:

1888లో జాన్ లావుడ్ అనే శాస్త్రవేత్త ఇంకు పెన్నును కనుగొనడం జరిగింది. ఇంకు పెన్ను వాడుకలో వచ్చిన అసౌకర్యాల వల్ల మరో మెరుగైన పెన్ను అవసరం ఏర్పడింది. 1938లో “లాజ్లో బిరో” అనే హంగేరియన్ జర్నలిస్టు బాల్‌పాయింట్ పెన్నులు తెలిసాయి రూపొందించడం, తర్వాత 10 జూన్ 1943న తన సోదరుడు ఇంజనీర్ “జియార్జీ బిరో”తో కలిసి బాల్పాయింట్ పెన్నును పెటెంట్ చేయడం జరిగింది. ఈ పరమ అద్భుత ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 10 జూన్‌న ప్రపంచ దేశాలు “జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం (నేషనల్ బాల్‌పాయింట్ పెన్ డే)” పాటించడం ఆనవాయితీగా మారింది. జాతీయ బాల్ పాయింట్ పెన్ దినం వేదికగా పెన్నులు కృతజ్ఞతలు తెలపడం, వివిధ రకాల పెన్నుల ప్రదర్శనలు, పెన్నులను అలంకరించి కృతజ్ఞతలు తెలపడం, పెన్‌తో మన ఆప్తులకు ఉత్తరం రాయడం, పెన్ను ప్రాధాన్యాన్ని గూర్చి వ్యాసం రాయడం, బాల్ పెన్ ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

రాయడానికి చవకైన ఏకైక ఉత్తమ సాధనం:

నాటి నుంచి నేటి వరకు విద్యాలయాలు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, కార్యాలయాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, అన్ని వర్గాల ప్రజలు/యువా/పిల్లలకు ఆత్మీయ నేస్తంగా, గౌరవాన్ని పెంచే చవకైన సాధనంగా, జేబుకు అలంకారంగా బాల్‌పాయింట్ పెన్ను అపార అద్వితీయ సేవలను అందిస్తున్నది. బాల్‌పాటింట్ పెన్ సాధనంగా విద్యా బోధనలు, సాంస్కృతిక వికాసం, ఆర్థిక వ్యవస్థలు, సగటు మనిషి జీవనశైలిలో ఓ అవిభాజ్య భాగం అయ్యింది. ఒక్క బాల్‌పాయింట్ పెన్‌తో దాదాపు 50,000 పదాలు రాస్తూ 100 పేజీల వరకు రాయవచ్చు. ప్రతి ఒక్కరు సాలీనా సగటున 4.3 బాల్ పెన్నులను వాడడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 125 బాల్ పెన్నుల అమ్మకాలు జరుగుతున్నాయి. పలు రకాల బ్రాండ్లు, అద్భుత ఆకృతులు, ఆకర్షణీయ కళా సంపదలతో బాల్ పెన్నులు మనకు అందుబాటులో ఉన్నాయి. తరగతి గది గుండెకాయ బాల్ పెన్ అని తెలుసుకోవాలి. అందరికీ చవకగా అందుబాటులో ఉన్న బాల్‌పాయింట్ పెన్నులు నమ్మకమైన, నాణ్యమైన, మృదు రాతల ధారలు పారిస్తున్నాయి. తేలికగా పేపరుపై పారడం, సులభంగా ఆరిపోవడం, అందమైన రాతలకు వారధిగా కావడం బాల్ పెన్ను ప్రత్యేకతలుగా పేర్కొనాలి.

ఆకర్షణీయమైన రంగులు, వివిధ కాళాకృతులతో నేడు బాల్ పెన్నులు పిల్లలు/యువతలో చదుకోవాలనే, రాయాలనే ఉత్సుకతను ప్రేరేపిస్తున్నాయి. నేడు అందమైన బాల్‌పాయింట్ పెన్నులు వ్యక్తుల స్థాయిని, వ్యక్తిత్వాలను చెప్పకనే చెబుతున్నాయి. మన జేబులో చేరిన పెన్ను మన హృదయ ఉపరితలంపై నాట్యమాడుతూ మనకు సమోన్నత గౌరవాన్ని ఆర్జించి పెడుతున్నాయి. మన జీవితంలో ఒక విడదీయరాని భాగమైన బాల్‌పాయింట్ పెన్నులను పూజాగదిలో ఇష్ట దైవం ముందు పెట్టి మనకు విజ్ఞాన వివేకాలను అందించమని వేడుకుందాం. మన బాల్‌పాయింట్ పెన్నుకు శతకోటి వందనాలు అర్పిద్దాం, సన్మార్గంలో నడిచే ధైర్యాన్ని ఇవ్వమని వేడుకుందాం.



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# హాస్య రస ప్రధాన చిత్ర దర్శకుడు ఇ.వి.వి



టాలీవుడ్‌లో అత్యంత విజయ వంతమైన దర్శకుడిగా ఇ.వి.వి సత్యనారాయణ నిలిచాడు. ఆయన 80 మరియు 90 లలో చాలా సూపర్ హిట్స్ ఇచ్చాడు. రాఘవేంద్ర రావు సీనియర్ దర్శకునిగా దూసుకుపోతున్న రోజుల్లో ఆయనకు గట్టి పోటీ ఇచ్చి అంతకు మించిన హిట్లు అందు కున్నాడు ఇ.వి.వి.. రాఘవేంద్ర రావు స్టార్ హీరోలతో సినిమాలు తీస్తే, ఇ.వి.వి. చిన్న హీరోలు, మధ్యస్థ హీరోలతో తీసి, హిట్లు, సూపర్ హిట్లు సాధించాడు. అలా 70 కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన కమర్షియల్ హిట్‌లతో కె రాఘవేంద్రరావుకు గట్టి పోటీ ఇచ్చాడు. ఆయన సినిమాల్లో కామెడీకి పెద్ద పీట వేసేవాడు. అప్పట్లో చాలా బాధగా ఉంటే.. మద్యం వదిలేసి ఇ.వి.వి సినిమాలు చూడండి అంటూ జోకులు కూడా వేసుకునే వాడట. ఆయన సినిమాల్లో నాన్ స్టాప్ కామెడీ ఉండేది. ఇప్పటికీ ఇ.వి.వి సినిమాలు చూసి ఎంజాయ్ చేసే వాళ్ళు చాలా మంది ఉన్నారు. అయితే తొలుత ఇ.వి.వి తన మొదటి సినిమా ఇ.వి.వి రాజేంద్ర ప్రసాద్ ను హీరోగా పెట్టి తీసిన చెవిలో పువ్వు చిత్రం పెద్ద ఫ్లాప్ అయ్యింది. ఫ్లాప్ అయ్యిందని... గోదావరిలో దూకి చావాలని అనుకున్నాడట. ఓ సారి రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ అఘాయిత్యానికి పాల్పడడం అనుకుని.. మళ్ళీ తన పిల్లలు, భార్య గుర్తొచ్చి ఆగిపోయాడట.

తరువాత ఆయన ప్రతిభను గుర్తించిన నిర్మాత రామానాయుడు 'ప్రేమఖైది' అనే చిత్రం చేసే అవకాశం కల్పించారు. అది పెద్ద హిట్ అయ్యింది. దీంతో వరుస అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి... అంటూ ఆయన చిన్న కొడుకు అల్లరి నరేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం జరిగింది. ఇ.వి.విగా ప్రసిద్ధిచెందిన ఈదర వీర వెంకట సత్యనారాయణ (జూన్ 10, 1958 జనవరి 21, 2011) తెలుగు సినిమా దర్శకుడు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన దర్శకుడు. జంధ్యాల శిష్యుడు. జంధ్యాల ఒరవడిలో హాస్యప్రధాన చిత్రాలు నిర్మించాడు. జంధ్యాల కంటే కొంతఘాటైన హాస్యాన్ని చిత్రాల్లో ప్రవేశ పెట్టాడు. రాజేంద్ర ప్రసాద్ తో ఆ ఒక్కటి అడక్కు, అప్పుల అప్పారావు, ఆలీబాబా అరడజను దొంగలు వంటి చిత్రాలు, నరేష్‌తో జంబలకిడి పంబ మొదలైన చిత్రాలు తీశాడు. సీతారత్నంగారి అబ్బాయి, ఏవండీ ఆవిడ వచ్చింది (శోభన్ బాబు) లాంటి చిత్రాల తర్వాత ఆమె, తాళి వంటి మహిళా పరమైన చిత్రాలు తీశాడు. అగ్రనటులైన చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ లతో చిత్రాలు తీశాడు. తర్వాత కుమారులిద్దర్ని హీరోలుగా పరిచయం చేశాడు.

సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లాలోని దొమ్మేరులో వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. నాన్న వెంకటరావు, అమ్మ వెంకటరత్నం. ఆయన కుటుంబానికి దొమ్మేరులో 70 ఎకరాల పొలం ఉండేది. బాల్యం నుండి సినిమాలంటే ఆసక్తితో కనీసం వారానికి రెండు సినిమాలైన చూసేవాడు. ఇంటర్మీడియట్ వరకు బుద్ధిగానే చదివినా, ఇంటర్‌కు నిడుదవోలు వెళ్ళిన సత్యనారాయణ కాలేజికి వెళ్ళకుండా రోజూ ఉదయం ఆట, మధ్యాహ్నం ఆట సినిమాలను చూడటం ఎక్కువై, హాజరు తక్కువై ఇంటర్మీయడ్ తప్పాడు. అప్పుడు సత్యనారాయణ తండ్రి ఆయనను కాలేజీకి పంపించి లాభం లేదని నిశ్చయించి తండ్రితో పాటు పొలం పనులు చూసుకోవటానికి నియమించాడు. 19 యేళ్ళకే 1976లో సరస్వతి కుమారితో పెళ్ళైంది. తర్వాత ఇద్దరు కొడుకులు పుట్టారు. వారికి రాజేష్, నరేష్ అని పేరు పెట్టారు. కొన్నాళ్ళకు వ్యవసాయంలో పెద్ద నష్టాలు రావడంతో పొలాలు అమ్మేయవలసిన పరిస్థితి కలిగింది. ఆ పరిస్థితుల్లో అక్కడ ఉండటానికి సత్యనారాయణ ఇబ్బంది పడి ఎక్కడికైనా మరో ఊరికి వెళ్ళిపోవాలనుకున్నాడు. ఇ.వి.వి స్నేహితుడు నిర్మాత నవతా కృష్ణంరాజు మేనల్లుడైన సుబ్బ రాజును సంప్రదించి ఒక సిఫారుసు ఉత్తరం పట్టుకుని మొదటిసారి మద్రాసు వెళ్ళాడు. నవతా కృష్ణంరాజును కలిసి ఉత్తరం ఇవ్వగా ఆయన సినీ రంగంలో జీవితం అనుకున్నంత సులభం కాదని, తిరిగి సొంత ఊరికి వెళ్ళిపొమ్మని హితవు చెప్పాడు. దాంతో పూర్తిగా నిరాశచెందిన సత్యనారాయణ, తిరిగి వెళ్ళినా చేసేదేమీ లేదనుకుని మద్రాసులోనే ఉండి వివిధ ప్రదేశాలు తిరుగు తుండేవాడు. పాండీ బజారుకు వెళ్ళి అక్కడ సహాయ దర్శకులు చెప్పుకునే మాటలు వినేవాడు. ప్రతి ఉదయం నవత కృష్ణంరాజు కార్యాలయం గేటు వద్ద నుంచుని ఉండేవాడు. ఒక నెలరోజుల తర్వాత కుర్రవాని పట్టుదలను చూసి ఏం చెయ్య గలవు అని అడిగాడు. సహాయ దర్శకున్ని అవుతానని చెప్పిన ఇ.వి.విని కనకాల దేవదాసు క్రింద ఓ ఇంటి భాగోతం సినిమాకు సహాయ దర్శకునిగా అవకాశం కల్పించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల

# నికోబార్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్



**వుదయం డెస్క్,** గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతులు ఇచ్చింది. రూ.13వేల కోట్లతో పౌర సైనిక విమానాశ్రయాన్ని నిర్మించనుంది. ఐఎన్ఎస్ బాజ్ వద్ద ఇప్పటికే ఉన్న నావికాదళ విమానాశ్రయాన్ని విస్తరించే ఆలోచనను పక్కనపెట్టింది. పర్యావరణపరంగా వైవిధ్యమైన ద్వీపంలో రూ.81వేల కోట్లతో ప్రకటించిన గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఇప్పటికే రాజకీయ దుమారం రేపుతోంది. ఈక్రమంలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం గమనార్హం.పౌర, సైనిక అవసరాలు తీరేలా గలాథియా బే సమీపంలోని చింగెన్ వద్ద ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. భౌగోళిక పరిమితుల వల్ల ఇప్పటికే ఉన్న ఐఎన్ఎస్ బాజ్ ఎయిర్‌స్టేషన్ వద్ద రన్‌వేను విస్తరించేందుకు దీర్ఘకాలికంగా ఉన్న ప్రణాళికను పక్కన పెట్టాల్సి వచ్చింది.

రానున్న ఐదేళ్లలో దీని నిర్మాణం పూర్తి కావొచ్చని సమాచారం. నికోబార్ దీవి మలక్కా జలసంధికి అతిసమీపంలో ఉండటంతో జీఎన్ఐ ప్రాజెక్టు వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుందని రక్షణరంగ వర్గాలు వివరించాయి. జలసంధికి సమీపంలోనే యుద్ధ నౌకలు, వైమానిక సదుపాయాలు ఉండటం నిఘాకు ఎంతో కీలకం కానున్నాయి. చైనాకు చెందిన 80 శాతం చమురు, 70 శాతం సహజవాయువు మలక్కా జలసంధి మీదుగా రవాణా అవుతుందని వెల్లడించాయి.

రూ.81వేల కోట్ల గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కింద తలపెట్టిన మౌలిక సదుపాయాల్లో ఎయిర్‌పోర్ట్ ఒకటి. అండమాన్ నికోబార్ ఐలాండ్‌ను ఆర్థిక, వ్యూహాత్మక హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్రం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకుతీసుకు వచ్చింది. ఈ ప్రాజెక్టును విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇది దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 160 చదరపు కిలోమీటర్ల మేర లక్షల చెట్లను నరికివేయాల్సి వస్తుందని, ఇది అభివృద్ధి అనే ముసుగులో జరుగుతున్న విధ్వంసమని మండిపడ్డారు.

# అమెరికా వీసా ఆశావహులకు శుభవార్త

## 750 డాలర్లతో 10 రోజుల్లోనే ఇంటర్వ్యూ స్లాట్




అమెరికా వెళ్లాలనుకునే వ్యాపారులు, పర్యాటకుల కోసం ట్రంప్ సర్కార్ కొత్త విధానాన్ని తీసుకురాబోతుంది. వీసా ఇంటర్వ్యూల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా 10 రోజుల్లోనే వీసా ఇంటర్వ్యూలను నిర్వహించేలా స్పెషల్ పైలట్ ప్రోగ్రామ్ నిర్వహించాలని నిర్ణయించింది. దీనికోసం ప్రీమియం ఎక్స్‌పెడైటెడ్ సర్వీస్ పేరుతో ప్రత్యేక సేవలను ప్రారంభించనుంది. ఈ మేరకు అమెరికా విదేశాంగశాఖ తమ ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసులు ప్రచురించింది.ఈ నోటీసు ప్రకారం జూలై 1వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ఈ పైలట్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ సేవలను వినియోగించుకోవాలంటే సాధారణ ఫీజు 185 డాలర్లకు అదనంగా 750 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద 750 డాలర్లు అదనంగా చెల్లించిన దరఖాస్తుదారులకు 10 రోజుల్లోపే వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ కల్పించనున్నారు.

అయితే ఈ సదుపాయం ఎంపిక చేసిన కొన్ని అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. వాటి జాబితాను జూలై 1వ తేదీకి ముందు ప్రకటించనున్నారు.

ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమెరికా ప్రవేశ నిబంధనలనున మరింత కఠినతరం చేశారు. కొన్ని దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్ కోసం భారీ బాండ్లు విధించడం, సోషల్‌మీడియా అకౌంట్లు సహా వ్యక్తిగత వివరాలపై విస్తృత పరిశీలన చేపట్టడం వల్ల వీసా ప్రక్రియలో ఆలస్యాలు పెరిగాయి. దీంతో అనేక దేశాల్లో వీసా ఇంటర్వ్యూల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే స్పెషల్ పైలట్ ప్రోగ్రామ్ కింద ప్రీమియం సర్వీస్‌ను అమెరికా ప్రవేశపెట్టడం గమనార్హం.అయితే, ఈ అదనపు ఫీజు చెల్లించడం ద్వారా ఇంటర్వ్యూ షెడ్యూల్‌ను మాత్రమే త్వరగా పొందగలరని.. వీసా కచ్చితంగా మంజూరు అవుతుందనే హామీ లేదని అమెరికా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దరఖాస్తుదారుల అర్హతల ఆధారంగానే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

డిమాండ్‌ను బట్టి ఈ పైలట్ ప్రోగ్రామ్‌ను వచ్చే ఏడాదికి పొడిగించే అవకాశం ఉందని సమాచారం.

# హోర్ముజ్ వద్ద కూలిన అపాచీ హెలికాప్టర్



**న్యూయార్క్:** హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్ ధ్వంసమవగా.. ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. హర్మూజ్‌పై ఇరాన్ విధించిన దిగ్బంధనాన్ని ఛేదించే ప్రయత్నాల్లో భాగంగా, యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) అపాచీ హెలికాప్టర్లతో పాటు ఫైటర్ జెట్‌లు, డ్రోన్‌లతో పహారా కాస్తోన్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలోనే రీపర్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించడంతో.. అపాచీ హెలికాప్టర్ ఇరాన్ కాల్పుల్లో కూలిపోయిందా లేదా ఏదైనా సాంకేతికలోపం తలెత్తిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరిలో అమెరికా, ఇరాన్‌ల మధ్య ఘర్షణలు ప్రారంభమైనప్పటినుంచి యూఎస్ సైనిక హెలికాప్టర్ కూలిపోవడం ఇదే మొదటిసారి. బీబీ జాగ్రత్త.. ఒంటరిగా మిగిలిపోతావు: నెతన్యాహుకు ట్రంప్ వార్నింగ్..!



# తమిళనాడు స్పీకర్ కీలక నిర్ణయం

**తమిళనాడు ,జూన్ 09 (ఎ.ఎం.ఎస్) :** టీవలే జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, విజయ్ నేతృత్వంలోని టీవీకే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజార్టీ మార్కును అందుకోలేకపోయింది. దీంతో కాంగ్రెస్, ఐయూఎంఎల్, వీసీకే, లెఫ్ట్ పార్టీల మద్దతుతో టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే మే 13 నాటి విశ్వాస పరీక్ష సమయంలో ఏఐఏడీఎంకే సీనియర్ నేతలు షణ్ముగం, ఎస్.పి. వేలుమణి నేతృత్వంలోని ఒక పెద్ద తిరుగుబాటు వర్గం విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసింది. దీంతో అసెంబ్లీలో విజయ్ ప్రభుత్వ బలం 119 నుంచి ఒక్కసారిగా 144 కి చేరి, ఆయనకు తిరుగులేని మెజార్టీ లభించింది.

తాజాగా 21 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఈపీఎస్ క్యాంప్ దాఖలు చేసిన పిటిషన్‌ను తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ మంగళవారం తిరస్కరించారు.

మే 13న అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్ష సందర్భంగా పార్టీ ఆదేశాలను ధిక్కరించి విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన ఈ ఎమ్మెల్యేలకు స్పీకర్ నిర్ణయంతో పెద్ద ఉపశమనం లభించింది.

# కాంగోలో ఎబోలా మహమ్మారి కలకలం



**బునియా:** డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా వైరస్ వల్ల మృతిచెందిన వారిన సంఖ్య 101కి చేరుకున్నది. ఆ దేశంలోని ఇటురి ప్రావిన్సులో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. అయితే అక్కడ ఉన్న సాయుధ గ్రూపుల వల్ల వైరస్ నియంత్రణ కష్టసాధ్యంగా మారుతోంది. తాజాగా ప్రభుత్వం కొత్త నివేదికను రిలీజ్ చేసింది. 550 పాజిటివ్ కేసుల్లో మృతుల సంఖ్య వందకు చేరినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్తగా 10 మంది మృతిచెందగా, 35 కొత్త కేసులు నమోదు అయినట్లు ప్రభుత్వం చెప్పింది. ఎబోలాలోని బుందిబుగ్యో స్ట్రెయిన్ మహమ్మారిలా మారినట్లు మే 15వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది.ఆరంభంలో ఎబోలా కేసులను గుర్తించడంలో ఆలస్యం కావడం వల్ల ఇప్పుడు పరిస్థితిని అదుపులోకి తేవడం కష్టంగా మారింది. ఇటురి, నార్త్ కివు, సౌత్ కివు ప్రావిన్సుల్లో ఎక్కువగా ఎబోలా కేసులు నమోదు అవుతున్నాయి. అయితే జుగు, ఇరుము, మాంబసా ప్రాంతాల్లో సాయుధ గ్రూపులు ఉండడం వల్ల అక్కడ వైరస్‌ను అదుపు చేయడం అసాధ్యమవుతోంది. మూడు కీలకమైన ప్రావిన్సుల్లో సుమారు 120 సాయుధ దళాలు ఉన్నాయని, వర్గ పోరు, రాజకీయ ప్రత్యర్థులు, అవినీతి వల్ల అక్కడ హింస పెరుగోతంది. దీంతో ఎబోలా కేసులను గుర్తించి, నియంత్రించడం పెను సవాల్‌గా మారింది.

కాంగోలో సుమారు 10 కోట్ల జనాభా ఉంటుంది. అక్కడ ఈ వైరస్ వ్యాపించడం ఇది 17వ సారి. 1976లో తొలిసారి ఎబోలా వైరస్‌ను గుర్తించారు. ప్రస్తుతం బుందిబుగయో స్ట్రెయిన్ ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. పొరుగు దేశం ఉగాండా నుంచి ఆ వైరస్ స్ట్రెయిన్ వ్యాప్తి జరిగినట్లు భావిస్తున్నారు.

# మంట పుట్టిస్తున్న వంటగ్యాస్

### కేంద్రం కొత్త నిర్ణయంతో సామాన్యులపై అదనపు భారం?




**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తన ప్రతిష్టాత్మక 'ప్రధాన మంత్రి ఉజ్వల యోజన' (పీఎంయూవై) లబ్ధిదారులకు అందించే సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్ల సంఖ్యపై కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఇస్తున్న సబ్సిడీ సిలిండర్ల కోటాను ఏడాదికి 4కు పరిమితం చేస్తున్నట్టు సోమవారం ఓ ఉన్నత ప్రభుత్వ అధికారి వెల్లడించారు. పేద కుటుంబాల సగటు వాడకానికి అనుగుణంగానే ఈ మార్పు చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది.2016 మే నెలలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా పేద కుటుంబాల్లోని మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందించారు. తొలినాళ్లలో ఏడాదికి 12 సిలిండర్లపై సబ్సిడీ ఇవ్వగా, గత ఏడాది దాన్ని 9కి తగ్గించారు. ఇప్పుడు తాజాగా ఆ సంఖ్యను 4కు కుదించారు. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ప్రవీణ్ మల్ ఖనూజా మాట్లాడుతూ.. ఉజ్వల లబ్ధిదారుల సగటు వార్షిక వినియోగం దాదాపు నాలుగు సిలిండర్లుగానే ఉందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

# హిమాలయాల్లో అద్భుతం

### జోజి లా ప్రాజెక్టులో చారిత్రాత్మక మైలురాయి



**వుదయం డెస్క్,** దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకటైన జోజి లా సొరంగం నిర్మాణంలో తుదిఘట్టం విజయవంతంగా పూర్తయ్యింది. సొరంగం రెండు వైపులను కలిపే చివరి పేలుడుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ట్రిగ్గర్ నొక్కారు. సొరంగంలో 2.5 మీటర్ల దూరంలోని బ్రేక్‌త్రూ ప్రదేశాన్ని విజయవంతంగా పేల్చివేసినట్లు తెలిపారు. ఈ బ్రేక్‌త్రూతో జమ్మూకశ్మీర్‌లద్దాఖ్‌లను అనుసంధానించాలనే దశాబ్దాల నాటి కల సాకారం కానుందన్నారు. ఈ కార్యక్రమానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా తదితరులు హాజరయ్యారు.

అనుకున్న సమయం కంటే ఆరు నెలల ముందే బ్రేక్‌త్రూ కార్యక్రమం నిర్వహించినట్లు నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (NHIDCL) అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 85 శాతం పనులు పూర్తయ్యాయని.. ఈ సొరంగం 2028 ఫిబ్రవరిలో ప్రజలకు అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లద్దాఖ్‌ల మధ్య 11.5 గంటలుగా ఉన్న ప్రయాణ సమయాన్ని ఈ సొరంగం కేవలం 15 నిమిషాలకే తగ్గిస్తుందన్నారు. సముద్ర మట్టానికి 11,578 అడుగుల ఎత్తులో ఒకే సొరంగంలో ఇరువైపులా రాకపోకలు సాగించేలా జోజి లాను నిర్మించారు. 24 అడుగుల ఎత్తు, 30 అడుగుల వ్యాసంతో అర్ధచంద్రాకారంలో దీనిని రూపొందించారు. రోడ్లు, సొరంగాలు, వంతెనలతో కలిపి మొత్తం పొడవు 30.89 కి.మీ.లు. జోజి లా 13.15 కి.మీ. పొడవు ఉంటుంది. కశ్మీర్‌లద్దాఖ్ మార్గంలో సోన్‌మార్గ్ సమీపంలోని బాల్తాల్ నుంచి ద్రాస్‌కార్గిల్ సమీపంలోని మీన్‌మార్గ్ ప్రాంతం వరకు అనుసంధానమై ఉంటుంది.

కొండల పైభాగం నుంచి సొరంగంలోనికి 474, 367, 213 మీటర్ల పొడవునా మూడు షాఫ్ట్స్ (గాలి, వెలుతురు వచ్చేలా నిలువుగా తవ్వే మార్గాలు) నిర్మించారు. ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే ఈ షాఫ్ట్స్ నుంచి రక్షణ చర్యలు చేపట్టడానికి వీలుంటుంది. సముద్రమట్టా

# ప్రభుత్వ ఖజానాకు ఊరట

### ఎంపీల జీతాల్లో 40 శాతం కోతకు గ్రీన్‌సిగ్నల్

**కీలక బిల్లుకు హంగేరి ఆమోదం**



**బుడాపెస్ట్ :** హంగేరి పార్లమెంట్ కీలక బిల్లుకు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రితో పాటు ఎంపీల జీతాల్లో 40 శాతం కోత విధించే ఈ బిల్లుకు 189 మంది ఎంపీలు ఆమోదం తెలిపారు. ప్రభుత్వ పరిపాలనా వ్యయాన్ని తగ్గించుకోవడం, దేశ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకోవడంలో ఈ బిల్లు కీలకంగా వ్యవహరించనుందని ఆ దేశ ప్రధాని పీటర్ మాగ్యర్ తెలిపారు. ఈ బిల్లుతో ఆయన ఎన్నికల ముందు ఇచ్చిన కీలక హామీని నెరవేర్చినట్టు అయింది. మాజీ ప్రధానమంత్రి విక్టర్ అప్పటి చట్టసభ సభ్యులను సంతృప్తి పరచడానికి ఎంపీల జీతాలను విపరీతంగా పెంచేశారని.. అది పరిపాలనా వ్యయాన్ని పెంచి ఆర్థిక స్థితిపై ప్రభావం చూపిందని ప్రస్తుత ప్రధాని పీటర్ తెలిపారు. కేవలం జీతాలే కాకుండా ఎంపీలకు లభించే అలవెన్సుల్లో కూడా ఈ కోత వర్తించనుంది. దేశ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకోవడంలో ఈ బిల్లు కీలకంగా వ్యవహరించనుందని ఆ దేశ ప్రధాని పీటర్ మాగ్యర్ తెలిపారు. ఈ బిల్లుతో ఆయన ఎన్నికల ముందు ఇచ్చిన కీలక హామీని నెరవేర్చినట్టు అయింది. మాజీ ప్రధానమంత్రి విక్టర్ అప్పటి చట్టసభ సభ్యులను సంతృప్తి పరచడానికి ఎంపీల జీతాలను విపరీతంగా పెంచేశారని.. అది పరిపాలనా వ్యయాన్ని పెంచి ఆర్థిక స్థితిపై ప్రభావం చూపిందని ప్రస్తుత ప్రధాని హంగేరి ఆర్థిక భద్రతను పెంచడంలో ఈ బిల్లు కీలకం కాబోతుందని ప్రధాని పీటర్ స్పష్టం చేశారు. ఎంపీల జీతాల్లో కోత ద్వారా వచ్చే ఆదాయం ఒక ఏడాది ప్రభుత్వ పరిపాలనకు సరిపోయే వ్యయా

# మహిళల భద్రతే లక్ష్యం



**: తమిళనాడు:** సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళల భద్రత కోసం రాష్ట్రంలో 'సింగప్పెన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్' అనే ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాన్ని ప్రారంభించారు. మహిళలు, పిల్లలపై నేరాలను ఆపేందుకు, ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే స్పందించేందుకు వీలుగా ఈ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విభాగానికి రూ. 354 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. సింగప్పెన్ ) దళం చిహ్నాన్ని ఆవిష్కరించి.. ఆ బృందాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గస్తీ వాహనాలను ప్రారంభించారు. ఓ వాహనాన్ని ఆయనే స్వయంగా నడిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ మహిళా భయంతో జీవించకూడదని.. సురక్షితంగా ఉన్నామనే భావనతో బయటకు రావాలని అన్నారు. స్త్రీలపై వేధింపులు కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదని.. మొత్తం సమాజానికి సంబంధించిన సమస్యని విజయ్ పేర్కొన్నారు. మహిళలపై నేరాలను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో మహళలు, చిన్నారులపై నేరాలకు మాదకద్రవ్యాల వ్యాప్తికి సంబంధం ఉందన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారే ఎక్కువగా ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థినులు, ఉద్యోగాలు చేసే మహిళల భద్రత కోసం సింగప్పెన్ బృందం రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్‌లను మోహరిస్తుందని తెలిపారు. వాటి సహాయంతో ఎక్కడ ఎవరు మహిళలను వేధించినా తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## దుబాయ్‌లో ప్రమాదం

# ముగ్గురు తెలంగాణ వాసుల మృతి

**హైదరాబాద్ :** దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ బస్సు, ట్రక్కు ఢీ కొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులతో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే ..దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతిగా గుర్తించారు.గాయపడిన వారిలో హైదరాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ సయీద్ కూడా ఉన్నాడు. వీరందరూ షార్జా కేంద్రంగా పని చేస్తున్న అల్యూమినియం గ్లాస్, డోర్ ఫ్రేమ్ పరిశ్రమలో పనిచేస్తున్నారు.

బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న భారత కాన్సులేట్ అధికారులు బాధితులను పరామర్శించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సంతకం ఫోర్జరీ ఆరోపణలు.. మమతా బెనర్జీ ఇంటికి సీఐడీ




పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష నేత హోదా కోసం ఎమ్మెల్యేల సంతకాలు ఫోర్జరీ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. దర్యాప్తులో భాగంగా మమతా బెనర్జీ నివాసానికి సీఐడీ బృందం వెళ్లింది. ప్రతిపక్ష నేత హోదా కోసం అసెంబ్లీ స్పీకర్‌కు సమర్పించిన ప్రతిపాదనలో టీఎంసీ శాసనసభ్యుల సంతకాలను ఫోర్జరీ చేశారనే ఆరోపణలు వచ్చాయి. వీటికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరుతూ సీఐడీ అధికారులు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఆయన ఇచ్చిన సమాధానం మేరకు తాజాగా పార్టీ అధినేత్రి నివాసం, కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**సోనియాతో దీదీ భేటీ..**

జాతీయ స్థాయిలో విపక్ష పార్టీల 'ఇండియా' కూటమి సమావేశం అనంతరం.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో మమతా బెనర్జీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భవిష్యత్తులో విపక్షాలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఇరువురు చర్చించినట్లు తెలుస్తోంది.

# ఆ జిల్లాలో ఇకపై పాఠశాలల్లో మాంసాహారంపై నిషేధం

**గోల్పారా:** అస్సాంలోని గోల్పారా జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇకపై పాఠశాలలకు మాంసాహార పదార్థాలు తీసుకురావద్దని గోల్పారా జిల్లా ప్రభుత్వ పాఠశాల ఇన్‌స్పెక్టర్ కార్యాలయం విద్యార్థులకు సూచించింది ద్యార్థులు బీఫ్ తిన్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇందులో నుంచి గుడ్లను మినహాయిస్తున్నట్లు తెలిపింది. ఇటీవల కృష్ణాయిలోని స్కూల్‌లో కొందరు విద్యార్థులు బీఫ్ తిన్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇందులో నుంచి గుడ్లను మినహాయిస్తున్నట్లు తెలిపింది. మధ్యాహ్న భోజనం లేదా విరామం సమయంలో విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని విడిచి వెళ్లడాన్ని కూడా నిషేధించింది.

CALL US
BOOK
YOUR
CLASSIFIED
9247698676

# మంథనిలో దుద్దిళ్ల రాజ్యాంగం.. పోలీసుల రాజ్యం నడుస్తోంది

**పూదరి సత్యనారాయణగౌడ్ అరెస్టు అక్రమం**

**జైల్ భరోకు పిలుపునిస్తే జైళ్లు కూడా సరిపోవు: మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథని, జూన్ 9 (ఉదయం ప్రతినిధి):**

మూడు ఓట్లతో గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారంలో ఉన్న ప్రతిసారి సమాజాన్ని అణచివేస్తూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్‌ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు.పదేళ్ల పాటు ప్రశాంతంగా ఉన్న మంథనిలో ప్రస్తుతం భయానక వాతావరణం నెలకొల్పుతున్నారని ఆరోపించారు. ముత్తా రం మండలం అడవి శ్రీరాంపూర్‌కు చెందిన బండి రాజు ఆత్మహత్య ఘటనలో అక్రమంగా పూదరి సత్యనారాయణగౌడ్‌ను అరెస్ట్ చేశారని అన్నారు. ఈ అరెస్టు చెల్లదని ఇప్పటికే ఒకసారి కోర్టు పేర్కొనగా, తాజాగా మరోసారి న్యాయ మూర్తి కేసును తిరస్కరించి వెనక్కి పంపించారని గుర్తు చేశారు.మంథనిలో ప్రస్తుతం అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా దుద్దిళ్ల రాజ్యాంగం, పోలీసుల రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులను కాపాడేందుకే పూదరి సత్యనారాయణ గౌడ్‌ను టార్గెట్ చేశారని, అసలు నిందితులను వదిలేసి రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.గౌడ, కాపు వర్గాల మధ్య విభేదాలు సృష్టించి హైదరాబాద్‌లో కూర్చొని మంట కాగుతున్నారని దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఇప్పటికే జైల్ భరో కార్యక్రమంపై హెచ్చరించినప్పటికీ పోలీసులు తీరు మార్చుకోవడం లేదని, ఒకవేళ జైల్ భరోకు పిలుపునిస్తే తమ కార్యకర్తలను ఉంచేందుకు జైళ్లు కూడా సరిపోవని అన్నారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా రాజ్యాంగబద్ధంగా పనిచేయాలని, ఖాకీ యూనిఫాంపై ప్రజలకు నమ్మకం పెంచే విధంగా వ్యవహరించాలని సూచించారు.

**బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే శంకరగిరి మాన్యాలే**

**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరిక**

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టే పోలీసు అధికారులకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొందరు సీఐలు, ఎస్సైలు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతోందని అన్నారు. పూదరి సత్యనారాయణగౌడ్‌పై నమోదైన కేసును కోర్టు తిరస్కరించడమే పోలీసుల తీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.శ్రీధర్‌బాబు లేదా ఇతర కాంగ్రెస్ నాయకుల సూచనలతో కాకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని పోలీసులకు సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ప్రాంతంలో పనిచేయాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారే పరిస్థితి రాకుండా పోలీసు కమిషనర్ జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, జూన్ 9 (ఉదయం ప్రతినిధి):**

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహించే త్రైమాసిక తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, యంత్రాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాం తాళాల భద్రత, సీసీ టీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా సిబ్బంది విధులు, రిజిస్టర్ తదితర అంశాలను తనిఖీ చేశారు. గోదాంలో భద్రపరిచిన యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, గోదాం ఇన్‌ఛార్జ్‌లు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# కవ్వాల్ అడవుల్లో ట్రైనీ ఐఏఎస్ లు



**జన్నారం,జూన్ 9(ఉదయం విలేఖరి)**

తెలంగాణ దర్శన్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్ ఐఎస్ శిక్షణాధికారులు మంగళవారం కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోని జన్నారం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ.సాయి శివాని, సచిన్ బసవరాజ్, పి. హరి ప్రసాద్, సురేష్ పామూరి. టైగర్ రిజర్వ్ సఫారీ మార్గంలో వన్యప్రాణులను వీక్షించారు. బర్డ్ వాచింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జన్నారం, తాళ్లపేట అటవీ రేంజ్ ల పరిధిలోని మల్యాల వాచ్ టవర్, బైసన్ కుంట, నీలుగాయి సోలార్ కుంటలను పరిశీలించారు. కవాల్ అభయారణ్యం, టైగర్ రిజర్వ్ లోని వృక్ష, జంతుజాలం గురించి తెలుసుకున్నారు. అటవీ, వన్యప్రాణి సంరక్షణలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలు, ఎకో టూరిజం కార్యక్రమాల గురించి అటవీ అధికారులను అడిగి వివరాలు సేకరించారు. జన్నారం అటవీ డివిజనల్ అధికారి ఎం.రామ్ మోహన్, డిప్యూటీ రేంజ్ అధికారి రాము అధికారులకు పలు అంశాలు వివరించారు.అటవీ సిబ్బంది భోజ, శ్రీకాంత్, అజీజ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందాలి

**విద్యార్థులందరికీ నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలి: జిల్లా కలెక్టర్**



**నిర్మల్ జిల్లా 9 జూన్ (ఉదయం ప్రతినిధి)**

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంతోపాటు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.పాఠశాలలు త్వరలో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా విద్యాబోధన సాగాలని సూచించారు. ఇప్పటికే మండలాలకు పాఠ్యపుస్తకాల పంపిణీ దాదాపు పూర్తయిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పాఠశాలలు, వసతి గృహాలు, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్నందున, వసతిగృహాల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాల గడువు తేదీలను పరిశీలించి, నాసిరకం లేదా గడువు ముగిసిన సరుకులు వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన భోజనాన్ని అందించడంలో మెస్ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ భోజన ప్రమాణాలు, ఆహార పదార్థాల నాణ్యతను మెస్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్టోర్ రూమ్‌లలో కూరగాయలు, ఇతర వస్తువులను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు.

# ఎరువుల స్టాక్ పాయింట్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి: కలెక్టర్



**నిజామాబాద్, జూన్ 09 :**

ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి అన్ని మండలాల తహసిల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా యూరియా, ఇతర ఎరువుల పంపిణీ జరిగేలా క్షేత్ర స్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా క్రాప్ బుకింగ్ కలిగి ఉన్న రైతులకే పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా నిర్ణీత పరిమాణంలో బుకింగ్ యాప్ ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. బ్యాక్ వాటర్ ఏరియాలోని భూములను ప్రభుత్వం భూసేకరణ జరిపి నష్టపరిహారం చెల్లించినందున, అలాంటి భూములలో పంట లు సాగు చేసే వారికి క్రాప్ బుకింగ్ చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా పంట భూమి కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేసుకునేలా చూడాలన్నారు.

# ప్రజలకు వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్



**జగిత్యాల జూన్ 09 (ఉదయం ప్రతినిధి)**

వర్షాకాలం నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆదేశించారు వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులు ముందస్తుగా ఆయిల్ బాల్స్ ఫాగింగ్ యాంటీ లార్వ స్ప్రేలు నిర్వహించాలని సూచించారు ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు అదేవిధంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడి ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు అవసరమైన పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు పునరావాస కేంద్రాలుగా ఫంక్షన్ హాల్స్ పాఠశాల భవనాలు తదితర సౌకర్యవంతమైన ప్రదేశాలను గుర్తించి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు వర్షాకాలంలో నదులు కాలువలు చెరువులు కుంటల సమీప ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు ప్రజల ప్రాణాలు ఆస్తుల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు ఈ సమావేశంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ఆదిలాబాద్, ఉదయం:**

ప్రభుత్వ ప్రాధాన్యత నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక పంచాయతీరాజ్ శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ముమ్మర తనిఖీలు నిర్వహించారు.కార్యాలయంలోని అన్ని విభాగాల గదులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం క్వాలిటీ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పనుల నాణ్యత పర్యవేక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ విభాగంలో సుమారు అరగంటకు పైగా సమయం గడిపి, ఉపాధి హామీ (నరేగా) సాఫ్ట్‌వేర్‌ను పరిశీలించి, పనుల ఆన్‌లైన్ ప్రాసెస్, నిధుల చెల్లింపుల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలతో పాటు పాఠశాలల్లో చేపట్టిన కిచెన్ షెడ్లు, మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈసందర్భంగా పంచాయతీరాజ్ ఈఈ శివరాం, సిబ్బందితో కలిసి కలెక్టర్కు పూల మొక్కను అందజేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో పలువురు సర్పంచులు, స్థానిక ప్రజలు కలిసి ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ సమస్యలు, గ్రామ పంచాయతీల నిధుల విడుదలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈఈ రమేష్ పవార్, క్వాలిటీ కంట్రోల్ డిఈఈ సలావుద్దీన్, సూపరింటెండెంట్ శ్రీరామ్, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యాదోపిడీపై కాంగ్రెస్ చేతగానితనం

**తల్లిదండ్రుల రక్తం తాగుతున్నా పట్టదా**

**ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలం**

**బీజేపీ తహసీల్దార్‌కు వినతిపత్రం**



**ధర్మపురి, జూన్ 09 (ఉదయం ప్రతినిధి):**

కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరిట మధ్యతరగతి తల్లిదండ్రుల రక్తాన్ని తాగుతున్నా, కాంగ్రెస్ ప్రభు త్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిం చడం దాని చేతగానితనానికి నిదర్శనమని బీజేపీ, బీజేవైఎం నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విద్యాసంస్థల దోపిడీపై కాంగ్రెస్ సర్కార్ అను సరిస్తున్న ఉదాసీన వైఖరిని నిరసిస్తూ మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డా రు. విద్యార్థులపై ఫీజుల అధిక భారాన్ని తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరుపేద విద్యార్థులకు అండగా ఉండాల్సి న ప్రభుత్వం నెలల తరబడి ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫల మైందని దుయ్యబట్టారు. కార్పొ రేట్ శక్తులకు కొమ్ముకాయడం మానేసి,తక్షణమే విద్యావ్యవస్థపై సమీక్ష నిర్వహించి మౌలిక వస తులు మెరుగుపరచాలని,రీఇంబ ర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కో–కన్వీనర్ పూదరి పవన్, బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, కార్యదర్శి బెజ్జారపు లవన్,మండలోజు.సూరజ్ సీనియర్ నాయకులు బండారు లక్ష్మణ్,బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమాందాస్ సత్య నారాయణ,సంగి మాధవ్,సుంకు మధుసూదన్,కలకోట రాజు, సోమిశెట్టి శివసాయి, బాకీ అనిల్, అప్పం శ్రీనివాస్,సోషల్ మీడియా కన్వీనర్ కాశెట్టి హరీష్, నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోడు రైతుల సమస్యలు పరిష్కరించండి :

**ఇంచార్జి పీసీసీఎఫ్ ని కోరిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు**



**కాగజ్ నగర్ ( ఉదయం ప్రతినిధి )**

హైదరాబాద్ నగరంలోని అరణ్య భవనంలో మంగళవారం రోజు ఇంచార్జి ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్ కుమార్ ని కలిసిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతల మానేపల్లి మండలం దిందా, కర్జెల్లి, బెజ్జూర్ మండలంలోని పాపన్ పేట మరియు పెంచికల్పేట్ మండలంలోని దరోగపల్లి తదితర గ్రామాల్లో ఫారెస్ట్ అధికారులు పోడు రైతులపై దౌర్జన్యాలు చేస్తున్నారని వెంటనే పోడు భూముల స్వాధీన ప్రక్రియను నిలిపివేయాలని కోరారు.సానుకూలంగా స్పందించిన ఇంచార్జి పీసీసీఎఫ్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీఎఫ్ఓ కి తగు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

# అర్హులైన ప్రతి పేదవానికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం..

**ప్రత్యామ్నాయ పంటలపై దుష్టి సారించాలి..**

**పేదల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది..**

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు**



**పెద్దపల్లి జూన్ 09 (ఉదయం ప్రతినిధి)**

పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వివిధ గ్రామా లకు చెందిన 66 మంది కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు 66,07,656 రూపాయల చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు..ముందుగా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారికి స్థానిక తహసీల్దార్ రాముడు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో పేదలకు ఇళ్లు ఇవ్వకుండా తీవ్రంగా మోసం చేశారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ ఓకే సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేద ప్రజల సొంతింటి కళను నెరవేరుస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని జూన్ చివరి నాటికి రెండో విడత కింద అదనంగా 2,000 ఇళ్లను ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. గ్రామాల్లో జనాభాను బట్టి అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మృగశిర కార్తె ప్రారంభమైనందున రైతులు ఆలస్యం చేయకుండా నార్లు పోసుకోవాలని. తక్కువ రోజుల్లో (105 రోజుల్లో) చేతికొచ్చే వరి రకాలను ఎంచుకోవాలని కోరారు. ఆలస్యమైతే దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా పత్తి, మొక్కజొన్న, కందులు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని. వీటికి పూర్తి స్థాయిలో మద్దతు ధర కల్పిస్తామని ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు రైతులకు భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూయించిందని రాష్ట్ర ప్రభుత్వానికి భారమైన రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న పనులను చూసి ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారు. అలాంటి వాళ్లకు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాముడు, ఎంపీడీవో దివ్య దర్శన్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రన్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సదయ్య, మాజీ జెడ్పిటిసి లంక సదయ్య, పలు గ్రామాల సర్పంచులు, నాయకులు కార్యకర్తలు మహిళలు అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోం

**ధర్మపురి అభివృద్ధిని అడ్డుకోవడమే విపక్షాల పని**

**అవినీతి ఆరోపణలపై ప్రమాణాని కైనా సిద్ధం కాంగ్రెస్ నేతల సవాల్**



**ధర్మపురి,జూన్ 9(ఉదయం ప్రతినిధి):**

రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు ముమ్మాటికీ హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీడి యా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాల య సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్,మండల కాంగ్రెస్ అధ్య క్షుడు చిలుముల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, వెల్గటూర్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు,నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పార్టీ విధేయతకు, కృతజ్ఞతకు కట్టుబడి ఉండే నాయ కుడని కొనియాడారు. 2006లో తనకు జడ్పీటీసీగా రాజకీయ అవకాశం కల్పించిన నాటి నాయకత్వానికి ఆయన ఇప్పటికీ కృత జ్ఞతతో వ్యవహరిస్తున్నారని గుర్తు చేశారు. క్యాబినెట్ హోదా లేకపో యినప్పటికీ, సీనియర్ నేత జీవన్ రెడ్డిపై ఉన్న గౌరవంతో తన క్యాం పు కార్యాలయంలో ఆయన ఫో టోను ఏర్పాటు చేసుకున్న సంస్కారం అడ్లూరిదని అలాంటి నాయకుడిపై లేని పోని ఆరోప ణలు చేయడం సరికాదని హిత వు పలికారు. ప్రజల్లో మంత్రికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకే విపక్ష నేతలు అసూయ తో రగిలిపోతున్నారని విమర్శించారు. అభివృద్ధి పనుల కోసం నిల్వ ఉంచిన ఇసుకపై ఇసుక మాఫియా అంటూ బురదజల్లడం మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌ల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలోనే పెద్ద ఎత్తున ఇసుక దందా సాగిందని, ప్రస్తుతం కేవలం చిన్న వ్యాపారులు మాత్రమే ఇసుకను తరలిస్తున్నారని స్పష్టం చేశారు. ధర్మపురిలో క్వారీకి సరిప డా ఇసుక నిల్వలు లేకపోవడం వల్లే అనుమతులుఆలస్యమవుతున్నాయని,ఈ సాంకేతిక విషయం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు తెలిసి కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.నియోజకవర్గంలో వరి కొనుగోళ్లపై విపక్షాలు చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు.కొనుగోలు కేంద్రా ల్లో రైతుల పూర్తి అనుమతి, సమక్షంలోనే ధాన్యం తూకాలు జరుగుతున్నాయని,ఎక్కడా పెద్దగా సమస్యలు లేవని తేల్చిచెప్పారు.గత ప్రభుత్వ హయాంలో రైతులను ముంచిన వ్యవహారాలపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముందు గా సమాధానం చెప్పాలని డిమాం డ్ చేశారు.నియోజకవర్గంలో ఇం దిరమ్మ ఇండ్ల నిర్మాణాలు,ధర్మ పురి క్షేత్ర అభివృద్ధి పనులు కొనసాగుతుంటే వాటిని చూసి తట్టుకోలేక, ప్రజల్లో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే కుట్రతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై పోరాడాల్సింది పోయి,కేవలం వ్యక్తిగత ఆరోపణ లకే పరిమితమవడం సిగ్గుచేట న్నారు. తమపై చేస్తున్న అవినీతి ఆరోపణలు నిరూపించాలని, అవసరమైతే ధర్మపురి లక్ష్మీనర సింహ స్వామి సన్నిధిలో ప్రమా ణాలకైనా తాము సిద్ధమని కాం గ్రెస్ నాయకులు విపక్షాలకు బహిరంగ సవాల్ విసిరారు.

# వ్యవసాయ సాగుకు ముందస్తు కార్యచరణ –జిల్లా కలెక్టర్

**మంచిర్యాల/జూన్ 9, (ఉదయం ప్రతినిధి)**

రాబోయే వానాకాలం వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తో కలిసి జిల్లా వ్యవసాయ శాఖ సహాయ అధికారులు, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ నివేదిక ప్రకారం జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో గత 5–6 సంవత్సరాలతో పోలిస్తే సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎల్–నినో ప్రభావం కారణంగా వాతావరణంలో వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పంటల వైవిధ్యీకరణ, మిశ్రమ, స్వల్పకాలిక పంటల సాగు, వంటి ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా అవగాహన కల్పించాలని, విత్తనాలు వేసే ముందు కనీసం 3 నుండి 4 రోజుల పాటు వర్షాలు కురిసి, భూమిలో ఒకటి నుండి ఒకటిన్నర అడుగుల లోతు వరకు తగిన తేమ ఉన్న తర్వాతే విత్తనాలు విత్తాలని రైతులకు సూచనలు అందించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు మొక్కజొన్న సాగును ప్రోత్సహించాలని, పంట అవశేషాలను పొలాలలో తగులబెట్టే చర్యలను పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పంట అవశేషాల దహనం వల్ల వాయు కాలుష్యం పెరగడం, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడటమే కాకుండా నేలలో సారం తగ్గిపోవడం వంటి అనేక నష్టాలు కలుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పొలాలలో పంట అవశేషాలను తగులబెట్టే రైతులపై గ్రామపంచాయతీల ద్వారా 2 వేల 500 రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు జరిమానా విధించబడుతుందని, జరిమానా చెల్లించని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యానికి టోకెన్ల జారీని నిలిపివేసే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్–నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు 08 రకాల సన్న ధాన్యం సాగు చేసేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. రసాయన వ్యవసాయం నుండి సహజ, సేంద్రియ వ్యవసాయానికి రైతులను మళ్లించే లక్ష్యంతో అమలు చేస్తున్న జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 17 క్లస్టర్లలో ప్రతి క్లస్టర్‌కు 125 మంది రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ అందించి, దశల వారీగా సహజ వ్యవసాయ విధానాల వైపు మళ్లించాలని, నానో యూరియా వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాబోయే 10 రోజుల పాటు వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా గ్రామాల వారీగా పర్యటించి రైతులతో సమావేశాలు నిర్వహించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన సాగు పద్ధతులు, పంటల ఎంపిక, నీటి వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి మండలంలో రైతు నమోదు కార్యక్రమ నిర్వహణను క్రమబద్ధంగా చేపట్టి, గ్రామ పర్యటనల అనంతరం నివేదికలను సమర్పించాలని తెలిపారు. వానాకాలం సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## జహీరాబాద్ కోహీర్ మీదుగా ప్రయాణించే హై స్పీడ్ ట్రైన్ ఏమాయె

**- ముంబై-హైదరాబాద్ హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ దారి మరలింపు జహీరాబాద్ ప్రాంత నాయకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోని జహీరాబాద్ ప్రాంతం**



**కోహీర్ జూన్ 9 (వుదయం ప్రతినిధి)**

మహమ్మద్ ఇమ్రాన్ బిసి మైనారిటీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందడం ఈ ప్రాంత రాజకీయ నాయకులకు ఇష్టం లేనట్టే వ్యవరిస్తున్నారు పేరుకే స్మార్ట్ సిటీ అభివృద్ధికి దూరమవుతు ప్రాజెక్టులు బుల్లెట్ ట్రైన్ ఎయిర్ పోర్టు విషయంలో ఈ ప్రాంత రాజకీయ నాయకులు మనకెందుకులే అని ఎవరి అంతటా వారు ఉంట్టు ఎంతసేపు ఒకరికొకరు విమర్శించుకోవడం తప్ప ఈ ప్రాంతానికి అభివృద్ధి చేయడానికి కృషి చేసింది లేదు నేను మీకందరికోరేటి ఒక్కటే రాబోయే భవిష్యత్ తరాల కోసం ఈ బుల్లెట్ ట్రైన్ విషయంలో గాని ఎయిర్పోర్ట్ విషయంలో గానీ నిమ్స్ ప్రాజెక్టు విషయంలో గానీ వచ్చే పరిశ్రమలకు వేరేవాళ్ల తీసుకుంటున్నారు కొన్ని ప్రాజెక్టులు గుజరాత్ కు తరలింపు అవుతుంటే కొన్ని ప్రాజెక్టులు వరంగల్ కు సిద్దిపేటకు వేరే వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు ఈ ప్రాంత రాజకీయ నాయకులకు నేను ప్రశ్నిస్తున్న ఎందుకు మీరు మౌనంగా ఉంటున్నారు ఈ ప్రాంతం అభివృద్ధికి మీరు సహకరించకపోతే రాబోయే ఎన్నికల్లో మీరు ఓటు హక్కు అడిగే నైతిక హక్కును కోల్పోతారు

ఇప్పటికైనా కళ్ళు తెరవండి పేరుకే స్మార్ట్ సిటీగా జహీరాబాద్ దేశం నలుమూలల స్మార్ట్ సిటీగ రూపొందుతుందని తెలిసింది కానీ ఇక్కడికి వచ్చి చూస్తే మాత్రం ఏలాంటి అభివృద్ధి లేదు ప్రజలకు ఈ ప్రాంతానికి ప్రధాన రహదారుల సౌకర్యం లేదు వచ్చిన పరిశ్రమల్లోలు వెనకకు వెళ్తుంటే ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి వస్తారా ఈ నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని ప్రశ్నిస్తున్నారు రాబోయే రోజుల్లో మిమ్మల్ని బహిష్కరిస్తారు నిద్రమత్తులో కెళ్ళి లేవండి ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించండి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ పార్లమెంట్లో జహీరాబాద్ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాని ప్రశ్నించడం లేదు అలాగే స్థానిక నియోజకవర్గ శాసనసభ్యులు కే మాణిక్ రావు ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడం లేదు మీరు మౌనంగా ఉంటే రాబోయే రోజుల్లో ప్రజలు మిమ్మల్ని బహిష్కరిస్తారు

## చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి




**– శ్రీరామ్ ఆర్య**

**నాగర్ కర్నూల్, జూన్ 09 (వుదయం బ్యూరో)**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా లోని తిమ్మజిపేట మండలం అప్పాజీపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం లీగల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథి డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి అని పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న నేరాల నుంచి ఎలా రక్షణ పొందాలో వివరించిన ఆయన, ఆర్థిక స్తోమత లేని వారికి సంస్థ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జములమ్మ దేవాలయ పరిసరాలలో హలాల్ నిషేధించి జట్కా పద్ధతి ప్రవేశపెట్టాలి

**-విశ్వహిందూ పరిషత్ – బజరంగ్ దళ్**

**గద్వాల జూన్ 09 (వుదయం ప్రతినిధి)**



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ జములమ్మ దేవాలయంలో జంతు బలుల విషయంలో హలాల్ విధానాన్ని నిషేధించి, సంప్రదాయ జట్కా పద్ధతిని అమలు చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు మంగళవారం దేవాలయ ఈవో పురేందర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామదేవతల ఆరాధనలో భాగంగా అనాదిగా కొనసాగుతున్న హిందూ సంప్రదాయాలను పరిరక్షించడం అవసరమని పేర్కొన్నారు. జములమ్మ అమ్మవారి ఆలయ పరిధిలో జరిగే జంతు బలులు హిందూ ఆచార వ్యవహారాలకు అనుగుణంగా సంప్రదాయ జట్కా పద్ధతిలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే భక్తుల మనోభావాలు, దేవాలయ సంప్రదాయాలు, స్థానిక ఆచారాలను గౌరవిస్తూ ఆలయ పరిసరాలలో హలాల్ విధానాన్ని అనుమతించకుండా తగిన చర్యలు చేపట్టాలని ఈవోకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. ప్రవీణ్ కుమార్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ తిరుపతి మణి, కౌన్సిలర్ చంద్రశేఖర్, గాడ్సే మోహన్, వెంకటేష్, మనోజ్, శ్రీకాంత్, తిరుమలేష్, భాస్కర్, రాజు, పవన్ తదితర విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట టౌన్ జూన్09 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మంగళవారం త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహిం చారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమె రాల పనితీరు, అగ్నిప్రమా దాల నివారణ కోసం ఏర్పా టు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరిక రాలను తనిఖీ చేశారు.అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పా టు చేసిన పోలీసు బందోబ స్తు, భద్రతా రిజిస్టర్లు, సంద ర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువం టి అలస భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ లో పారదర్శకతను నిర్ధా రించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీ ఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయం లో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమ లు చేస్తున్నామని అన్నారు. గోదాంలోని భద్రతా ఏర్పాట్ల ను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎలక్షన్ సెల్ సూపరింటెం డెంట్ జయ సుధ, తహసీ ల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సి పల్ కమిషనర్ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతిని ధులు, సంబంధిత అధికారు లు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్వాసితులకు భారీ ఊరట

**నాగర్ కర్నూల్, జూన్ 09 (వుదయం బ్యూరో)**

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనుల కోసం రూ.637.15 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆర్ అండ్ ఆర్ పనులు, గృహ నిర్మాణాలు, పునరావాస కాలనీల అభివృద్ధికి రూ.587.15 కోట్లు, పెండింగ్ భూసేకరణ పూర్తికి మరో రూ.50 కోట్లు అవసరమని అంచనా. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కృషితో ఆర్ అండ్ ఆర్ పనులకు ఇప్పటికే రూ.25 కోట్ల అదనపు నిధులు మంజూరయ్యాయి. వట్టెం రిజర్వాయర్ పరిధిలో 466 నిర్వాసిత కుటుంబాల కోసం ఇప్పటివరకు రూ.83.13 కోట్లు వెచ్చించారు. ఇందులో పరిహారంగా రూ.53.20 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.29.93 కోట్లు ఖర్చయ్యాయి. పునరావాస కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, గృహ నిర్మాణాల కోసం మరిన్ని నిధులు అవసరమని ఎమ్మెల్యే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితులకు పరిహారం, మౌలిక వసతుల కల్పనలో జాప్యం లేకుండా నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించింది. రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో కొనసాగుతున్న ఈ పథకం ద్వారా 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యం. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు ప్రయోజనం చేకూరనుంది. 26,882.95 ఎకరాల భూసేకరణ పూర్తయింది. కేవలం 196.64 ఎకరాల భూసేకరణ మాత్రమే పెండింగ్‌లో ఉందని అధికారులు వెల్లడించారు. భూసేకరణ పూర్తయితే ప్రాజెక్టు పనులు మరింత వేగం పుంజుకుంటాయి. ప్రభుత్వ ఆమోదంతో వేలాది నిర్వాసిత కుటుంబాలకు ఉపశమనం లభించనుంది. నిర్వాసితుల సంక్షేమానికి సహకరించిన ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## బీవీఆర్ఐటీలో అంతర్జాతీయ వామ్స్-2026 సదస్సు ప్రారంభం

**హత్నూర వుదయం ప్రతినిధి జూన్ 9**

: బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ అంతర్జాతీయ ఐఈఈCఈ వైర్లెస్, యాంటెన్నాస్ అండ్ మైక్రోవేవ్ సింపోజియం (వామ్స్2026) మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. జూన్ 10 నుంచి 13 వరకు జరగనున్న సదస్సుకు ముందుగా నిర్వహించిన ప్రీకాన్ఫరెన్స్ వర్క్‌షాప్, ఐఈఈఈ డిస్టింగ్విష్డ్ లెక్చరర్ టాక్స్ కార్యక్రమాలు విశేష ఆదరణ పొందాయి.బీవీఆర్ఐటీ రతన్ టాటా బ్లాక్‌లో జరిగిన కార్యక్రమంలో అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీ, ఫ్రాన్స్, తైవాన్ తదితర దేశాలకు



చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. అధునాతన యాంటెన్నా సాంకేతికతలు, 6జీ కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఐఓటీ, ఉపగ్రహ కమ్యూనికేషన్లు, స్మార్ట్ యాంటెన్నా వ్యవస్థలు తదితర అంశాలపై నిపుణులు ప్రసంగించారు. సదస్సుకు డా. బి.ఆర్. సంజీవ రెడ్డి జనరల్ చైర్‌గా వ్యవహరిస్తుండగా, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకులు, యువ ఇంజినీర్లకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే వేదికగా నిలుస్తుందని తెలిపారు. దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## అసంపూర్తి రోడ్డును వెంటనే పూర్తి చేయాలని మాస్ లైన్ ఆందోళన బాట



**నారాయణపేట టౌన్ జూన్09 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట యోజకవర్గం లోని అప్పక్ పల్లి కోటకొండ,కోయిల్ కొండ అసంపూర్తి రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ ఎం ఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము,డివిజన్ కార్యదర్శి కాశినాథ్ తెలిపారు. మంగళవారం నారాయణపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతునారాయణపేట జిల్లా కేంద్రం నుండి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రాని కలిపే ప్రధానమైన రెండు వరుసల రోడ్డును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గం రోడ్డు పనులన్నీ వెంట వెంటనే పూర్తవుతాయి. కానీ నారాయణపేట నియోజక వర్గ రోడ్లు ఎందుకు అసంపూర్తిగా మిగులుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. నారాయణపేట కొడంగల్ రెండు నియోజకవర్గాలు రెండు కళ్ళలాగా నాకు ఉంటాయి అని పిసిసి అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి ఎన్నికల సభలో మాట్లాడారనీ గుర్తు చేశారు. కొడంగల్ రోడ్లు మాత్రమే పూర్తి అవుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో పని చేస్తే బిల్లులు తొందరగా వస్తాయని కాంట్రాక్టర్లు అక్కడి రోడ్లనే పూర్తి చేస్తున్నారు. నారాయణపేట నియోజకవర్గ రోడ్లను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. అసంపూర్తిగా పనులు చేశారు. అప్పకుపల్లి నుండి కోటకొండ మధ్యలో నాలుగు కిలోమీటర్లు, కోటకొండ గ్రామంలో రెండు కిలోమీటర్లు, కోటకొండ కోయిలకొండ మధ్యలో ఆరు కిలోమీటర్లు రోడ్డును పూర్తి చేయాల్సి ఉందన్నారు. అధికారులకు, ప్రజాప్రతిని ధులకు ఎన్నిసార్లు విన్న వించినా చలనం లేదని అన్నారు. దీంతో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 9 గంటలకు కోటకొండ భగత్ సింగ్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కు చేరుకుంటుందన్నారు. 16న నారాయణపేట జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో, 17న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని పై మూడు రోజుల అప్పక్ పల్లి, కోటకొండ, కోయిలకొండ రోడ్డు సాధన ఉద్యమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాద గిరి, మండల కార్యదర్శి బి నరసింహ, గ్రామ కార్యదర్శి హాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, రైతు సంఘం జిల్లా నాయకులు బాలకృష్ణ, టియుసిఐ జిల్లా నాయకులు ఎదురింటి నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకట్ రాములు, పి వై ఎల్ నాయ కులు సలీం,మంగలి హనుమంతు, నారాయ ణపేట టౌన్ నాయకులు నజీర్ అహ్మద్, హారీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ రికార్డును బద్దలు కొట్టిన నరేంద్ర మోడీ

**- ప్రధానికి నందు నామాజీ శుభాభివందనాలు**

**నారాయణపేట జూన్09 (వుదయం ప్రతినిధి)**



భారతదేశ ప్రధానిగా 4,398 రోజులు కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూ రికార్డును నేడు బుధవారం ప్రస్తుత బిజెపి ప్రధాని నరేంద్రమోడీ 4,399 రోజుల ప్రధానిగా ఇంకా కొనసాగనున్న ప్రధానిగా బద్దలు కొట్టారు.రెండు పూర్తి మెజారిటీ ప్రభుత్వాలను నెహ్రూ తొలి కాంగ్రెస్ నేతగా మే 13 1952 నుంచి మే 27 1964 వరకు ప్రధానిగా 4,398 రోజులు ప్రధానిగా ఉన్నారు.అయితే కాంగ్రెసేతర బిజెపి నేత ప్రధాని నరేంద్రమోడీ మే 26,2014 నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటన విడుదల చేస్తూ అప్రతిహతంగా మూడు సార్లు దేశ ప్రధానిగా కొనసాగుతూ చరిత్ర సృష్టించారని అన్నారు.ఈ మైలు రాయిని ఎవరు దాటే అవకాశం లేదని అన్నారు. చరిత్ర సృష్టించిన ప్రధాని నరేంద్ర మోదీ కి ఆయన శుభాభివందనాలు తెలిపారు. ఇంతటి నేతకు దేశ అభివృద్ధి కోసం దేశ ప్రజలు మరింత అండగా నిలవాలని కోరారు.

## విత్తనాలు కొనేటప్పుడు ప్రతి రైతు రసీదు తీసుకోవాలి

**- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే లక్ష్మీపతి గౌడ్**

**నారాయణపేట జూన్09 (వుదయం ప్రతినిధి)**



విత్తనాలు కొన్న ప్రతి రైతు తప్పకుండా రసీదు తీసుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ లక్ష్మీపతి గౌడ్ సూచించారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం షేర్నపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇట్టి విజ్ఞాన సదస్సు కు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మీపతి గౌడ్ హాజరై గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల యొక్క భూసార పరీక్షలు చేయించు కొని, పంటల బీమా చేయిం చి, నష్టాలను అధిగమించ వచ్చని తెలిపారు. నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపర చుకంటే నష్ట పరిహారం పొందే వెసలుబాటు ఉంటుందని అన్నారు. వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు, ఇది ఒక సంస్కృతి, జీవన విధానం. మనకు కావాల్సిన ఆహారా న్ని అందించేది వ్యవసాయ మేఅన్నారు.బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, ఆడ పిల్లలకు చిన్న వయ స్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండి మంచి రక్షణ విద్యావకాశాలు కల్పి స్తే, వారి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది అని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100 కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవ చ్చు అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమానికి సర్పంచ్ అనురాధ, పంచాయితీ కార్యదర్శి శైలజ అనురాధ ,కానిస్టేబుల్ శ్యామప్ప,అంగన్వాడీ టీచర్ భాగ్య రేఖ,వార్డ్ మెంబెర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పశువులలో జబ్బ వాపు, గొంతువాపు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పాల్గొన్న



**- పెద్దపల్లి గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి**

**మల్దకల్ జూన్ 09 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లామల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో ఉచిత గొంతు వాపు, జబ్బ వాపు వ్యాధి నివారణ టీకాల శిబిరంను గ్రామ సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ ఉష తో కలిసి మంగళవారం ప్రారంభించారు. పాల్వాయి పశు వైద్య అధికారిని డా. ఉష మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చే వ్యాధులు గేదెలలో గొంతువాపు, గో జాతి పశువులలో జబ్బ వాపు, గొంతువాపు వ్యాధి ఎక్కువగా గేదెలలో వస్తుందని, ఈ వ్యాధిని గురక వ్యాధి అని కూడా అంటారు. గొంతువాపు వ్యాధి లక్షణాలు 104 106 జ్వరం, కళ్ళు ఎర్రబడి నీరు కారటం, గొంతు పై భాగాన మెడ కింద వాపు, శ్వాస పీల్చేటప్పుడు పశువులు ఆయాసపడతాయి. జబ్బా వాపు వ్యాధి లక్షణాలు బలంగా ఆరోగ్యంగా ఉన్న గోజాతి పశువులలో ఎక్కువగా వస్తుంది.

జబ్బా, తొడ కండరాల పైన వాపు కనపడుతుంది.

కావున పశుపోషకులు ముందస్తు జాగ్రత్తగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశు యాజమానులు అప్రమత్తంగా ఉండి రోగాల భారీ నుండి తమ పశువులను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 52 గో జాతి పశువులు, 20 గేదెల లో టీకాలు వేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మధు, సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మీనరసింహ, ఓంశంకర్ ఉల్వ నర్సింహా, కుర్వ నర్సింహా, శ్రీశైలం, రమేష్, రంగస్వామి, గ్రామస్తులు, పశు పోషకలు పాల్గొన్నారు.

## తొందరపడి విత్తనాలు వేయొద్దు

**– జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు**

**నాగర్ కర్నూల్ జూన్ 09 (వుదయం ప్రతినిధి)**



ఈ వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం తో సాధారణం కంటే తక్కువ వర్షపాతం, జూన్‌లో వర్షాలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున రైతులు తొందరపడి విత్తనాలు వేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. యశ్వంత్ రావు మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు వాతావరణ శాఖ అంచనాలను ప్రస్తావిస్తూ, తగినంత వర్షం నమోదైన తర్వాతే విత్తనాలు వేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా స్వల్ప కాలిక, కరువు తట్టుకునే పంట రకాలను ఎంపిక చేసుకోవాలని కోరారు.వరి రైతులు నర్సరీలను దశలవారీగా ఏర్పాటు చేసుకోవాలని, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని యశ్వంత్ రావు తెలిపారు. అలసంద, పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాల సాగును ప్రోత్సహిస్తూ, అందుబాటులో ఉన్న నేల తేమను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు సమయంలో బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు సాంకేతికతలపై సందేహాలుంటే మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## జములమ్మ ఆలయ పరిధిలో హలాల్‌కు నో.. జట్కాకే ఓటు




**- సంప్రదాయ జట్కా విధానానికే ప్రాధాన్యం కల్పించాలి**

**- ఈవోకు విహెచ్‌పీ, బజరంగ్ దళ్ వినతి**

**గద్వాల జూన్ 09 (వుదయం బ్యూరో)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీ జములమ్మ అమ్మవారి ఆలయ పరిధిలో జంతు బలుల నిర్వహణలో హలాల్ విధానాన్ని నిలిపివేసి, హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జట్కా పద్ధతినే అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ఈవో పురేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామదేవతల ఆరాధనలో భాగంగా తరతరాలుగా కొనసాగుతున్న హిందూ ఆచార సంప్రదాయాలను పరిరక్షించడం అవసరమని నాయకులు పేర్కొన్నారు. జములమ్మ అమ్మవారి ఆలయం భక్తుల విశ్వాసాలకు, స్థానిక సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందని, ఆలయ పరిధిలో జరిగే జంతు బలులు సంప్రదాయ జట్కా విధానంలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భక్తుల మనోభా వాలు, దేవాలయ సంప్రదాయాలు, స్థానిక ఆచారాలను గౌరవిస్తూ ఆలయ పరిసరాల్లో హలాల్ విధానాన్ని అనుమతించకుండా తగిన నిర్ణయం తీసుకోవాలని ఈవోను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. ప్రవీణ్ కుమార్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ తిరుపతి మణి, కౌన్సిలర్ చంద్రశేఖర్, గాడ్సే మోహన్, వెంకటేష్, మనోజ్, శ్రీకాంత్, తిరుమలేష్, భాస్కర్, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఎదుట న్యాయవాదుల ఆవేదన

**- కోర్టు స్థలంపై పోరాటం.. పోలీసు పికెట్‌పై మండిపాటు**

**గద్వాల జూన్ 09 (వుదయం బ్యూరో)**

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం: బార్ అసోసియేషన్ గద్వాల, జూన్ 9: జిల్లా కోర్టు సముదాయం నిర్మాణం కోసం అనంతపురం గుట్టల వద్ద కేటాయిం చిన స్థలాన్ని వ్యతిరేకిస్తూ గద్వాల న్యాయవాదుల ఆందోళన మరింత ఉధృతమైంది. తమ నిరసనలకు ఆటంకాలు సృష్టిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయవాదులు సోమవారం కోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరసన చేపట్టి, అనంతరం రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు.కోర్టు ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాంతియుతంగా చేపడుతున్న ఉద్యమాన్ని అణిచివేసేం దుకు ప్రభుత్వం పోలీసు వ్యవస్థను వినియోగిస్తోందని ఆరోపించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కావలి నరసింహులు మాట్లాడుతూ, దీక్షా శిబిరానికి అనుమతి కోరితే అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న న్యాయవాదులకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, సామాన్య ప్రజల హక్కుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కోర్టు వంటి ప్రశాంత ప్రాంతంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు ముప్పు లేని చోట పికెట్ ఏర్పాటు చేయడం ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతుందని అన్నారు. గద్వాల కోర్టు చరిత్రలో ఎన్నడూ లేని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని, తమ గోడును వినిపించుకునే పరిస్థితి లేక చివరకు అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి వినతిపత్రం సమర్పించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కోర్టును ప్రజలకు సులభంగా చేరుకునే ప్రాంతంలో నిర్మించాలని, శాంతియుత నిరసనలకు ఆటంకాలు కల్పించకుండా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తొలి మహిళా పార్కు.. సమస్యలతో సహవాసం



**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో జిల్లాలోనే తొలి మహిళా పార్కును ఆరు సంవత్సరాల క్రితం రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. మహిళలు, చిన్నారులు ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు నిర్మించిన ఈ పార్కు ప్రస్తుతం నిర్వహణ లోపంతో సమస్యల నిలయంగా మారింది.

పార్కులో ఒకప్పుడు పచ్చదనాన్ని అందించిన మొక్కలు నీటి కొరత, సంరక్షణ లేకపోవడంతో పూర్తిగా ఎండిపోయాయి. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాల్లో చాలా వరకు దెబ్బతిని వినియోగానికి పనికిరాకుండా మారాయి. కొన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత కూడా లేకపోవడంతో పార్కు అందం కోల్పోయింది.స్థానిక మహిళలు, కాలనీవాసులు పార్కును పునరుద్ధరించి గ్రీనరీ అభివృద్ధి చేయడంతో పాటు పాడైన ఆట పరికరాలను మరమ్మతు చేయాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటే మహిళలు, చిన్నారులకు ఈ పార్కు మళ్లీ ఉపయోగకరంగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థిని సన్మానించిన జిల్లా కలెక్టర్



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండలం 10వ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ చూపి 564 మార్కులు సాధించిన విద్యార్థిని లాగ్యాల ఐశ్వర్య,ను మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతిమ సింగ్ చేతుల మీదుగా సన్మానించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు 100కు 100% ఉత్తీర్ణత సాధించడంపై ఉపాధ్యాయ బృందంతో పాటు తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా విద్యాధికారి రాజు, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బజాజ్ ఫిన్‌సర్వ్ బోర్డ్ నుంచి వైదొలిగిన రాజీవ్ బజాజ్



బజాజ్ ఫిన్‌సర్వ్ బోర్డు నుంచి రాజీవ్ బజాజ్ వైదొలగనున్నారు. బజాజ్ ఆటో విభాగంలో పెరిగిన బాధ్యతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్స్‌లో కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం రాజీవ్ బజాజ్.. బజాజ్ గ్రూప్‌లో ఆటో విభాగానికి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. తాను పూర్తిగా ఆటోమొబైల్ వ్యాపారం పైనే దృష్టిసారించేందుకు.. బజాజ్ గ్రూప్‌లోని ఇతర సంస్థల నుంచి క్రమంగా వైదొలుగుతున్నారు. అలాగే కొత్తగా ఏర్పాటుచేసిన వ్యాపారాల పర్యవేక్షణ వంటి కారణాల రీత్యా కొన్ని బాధ్యతలను తగ్గించుకోవాల్సి వస్తోందని రాజీవ్ తెలియజేశారని, జులై 31న జరగనున్న వార్షిక సర్వసభ్య సమావేశంలో పునర్నియామకం కోరకూడదని ప్రకటించినట్లు ఫైలింగ్స్‌లో ఫిన్‌సర్వ్ పేర్కొంది.




# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆఖరిలో పీఎస్‌యూ బ్యాంక్, ఫైనాన్షియల్, ఆటో స్టాక్స్‌కు కొనుగోళ్ల మద్దతు లభించడం సూచీలకు కలిసొచ్చింది. మరోవైపు ఇరాన్‌– ఇజ్రాయెల్ మధ్య దాడులు ఆపడం, ఇరాన్– అమెరికా మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం మన సూచీలపై సానుకూల ప్రభావం చూపింది.




సెన్సెక్స్ ఉదయం 74,035.41 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,524.26) లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు నష్టాల్లోకి జారుకున్నా, తర్వాత కోలుకుంది. చివరికి 394.50 పాయింట్ల లాభంతో 73,918.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 119.10 పాయింట్ల లాభంతో 23,242.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.36గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టైటాన్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, ఎటర్నల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4332 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## పెరిగిన నష్టం.. ఈడీ సమన్లు..
## జెప్టో ముసాయిదా పత్రాల్లో కీలక విషయాలు

ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో తొలి పబ్లిక్ ఇష్యూకు (Zepto IPO) సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా సవరించిన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి (SEBI) సమర్పించింది. దీంట్లో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి. వాటా విక్రయం, నష్టాలు, ఈడీ సమన్లు వంటి అంశాలను కంపెనీ పొందుపరిచింది. ఆ వివరాలు ఇవీ.. జెప్టో సంస్థ ఐపీఓలో భాగంగా ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.8,010 కోట్లను సమీకరించనుంది. దీంతోపాటు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా వాటాదార్లు తమ షేర్లను విక్రయించనున్నారు. దీంతో జెప్టో ఐపీఓ సైజ్ సుమారు రూ.11వేల కోట్లు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. జులైలో ఐపీఓకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ ఐపీఓలో వ్యవస్థాపకులు ఆదిత్ పలీచా, కైవల్య వోహ్రా వాటా విక్రయానికి దూరంగా ఉండనున్నారు. వీరిద్దరికీ రూ.5 ముఖ విలువ కలిగిన 18.47 శాతానికి సమానమైన 230 కోట్ల షేర్లు ఉన్నాయి. అదే సమయంలో వెంచర్ క్యాపిటలిస్టులు మొత్తం 11.35 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఇందులో నెక్సస్ వెంచర్స్ అత్యధికంగా 8.77 కోట్ల షేర్లను అమ్మనుంది. రేజర్ వెంచర్స్ జెప్టో ఎల్ఎల్‌సీ, కాంట్రరీ జెప్ హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ, కైజర్ ఫౌండేషన్ హాస్పిటల్స్, ఐజర్ పర్మినెంట్ గ్రూప్ ట్రస్ట్ వంటి సంస్థలు కూడా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో తమ వాటాలను విక్రయించనున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో జెప్టో రూ.5,905.19 కోట్ల నికర నష్టం చవిచూసినట్లు కంపెనీ సెబీకి సమర్పించిన తన ముసాయిదా పత్రాల్లో పేర్కొంది. అంతకుముందు ఏడాది ఈ నష్టం రూ.4,699.71 కోట్లుగా ఉంది. నష్టాలు పెరిగినప్పటికీ కార్యకలాపాల ద్వారావచ్చే ఆదాయం రూ.11,109 కోట్ల నుంచి రూ.22,623 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో రూ.1,538 కోట్ల నికర నష్టాన్ని చవిచూసినట్లు వెల్లడించింది. ప్రమోటర్లైన ఆదిత్ పలిచా, కైవల్య వోహ్రా ఈడీ సమన్లు అందుకున్నట్లు కంపెనీ ముసాయిదా పత్రాల్లో వెల్లడించింది. విదేశీ పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని ఈడీ కోరినట్లు తెలిపింది. 2026 ఏప్రిల్ 8న ఈ సమన్లు అందుకోగా.. సంబంధిత డాక్యుమెంట్లను ఈడీకి అందజేసినట్లు తెలిపింది. ఏప్రిల్ 17, 22 తేదీల్లో వోహ్రా, ఏప్రిల్ 20, మే 15 తేదీల్లో పలిచా ఈడీ ముందు హాజరైనట్లు వెల్లడించింది.




## ఏఐ ప్రాణాంతక ముప్పు కాదు..: టీసీఎస్ ఛైర్మన్



ఐటీ రంగంపై కృత్రిమ మేధ ప్రభావం గురించి నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS) ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ప్రాణాంతకమైన ముప్పు కాదని, అదొక అవకాశమని వెల్లడించారు. సంస్థ 31వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారులతో తాజాగా ఆయన మాట్లాడారు. ఏఐతో ప్రపంచ టెక్నాలజీ మార్కెట్ విస్తరించడానికి సిద్ధంగా ఉందని, ఐటీ రంగానికి కొత్త వ్యాపార అవకాశాలు వస్తాయని చంద్రశేఖరన్ ఆశాభావం వ్యక్తంచేశారు. ''ప్రస్తుతం ఐటీ మోడల్‌కు ఏఐ ప్రాథమిక ముప్పు అని కొందరు చెబుతున్నారు. కానీ నేను ఈ పరిస్థితులను భిన్నంగా చూస్తున్నాను. ఐటీ రంగానికి ఇప్పటివరకు లభించని ముఖ్యమైన అవకాశం అని భావిస్తున్నాను. ప్రస్తుతం టీసీఎస్ భారీగా ఏఐ ఏజెంట్లను అభివృద్ధి చేస్తోంది. కంపెనీలో ఉద్యోగులు, ఏఐ ఏజెంట్లు సమాన సంఖ్యలో ఉండేరోజు ఎంతో దూరంలో లేదు'' అని పేర్కొన్నారు. ''మనుషులు చేసే కొన్ని పనులను ఏఐ ఏజెంట్లు చేయడం మొదలుపెట్టాయి. అందుకే టీసీఎస్ గతంలో మాదిరిగా భారీ ఎత్తున నియామకాలు చేపట్టదు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వ్యాపార కార్యకలాపాల్లో కృత్రిమ మేధ భాగం అవుతుండటంతో.. నియామకాల విషయంలో మార్పు ఒక్క టీసీఎస్‌కే పరిమితం కాదు. అదే సమయంలో ఉద్యోగులను తగ్గించుకునే ప్రణాళికలు టీసీఎస్‌కు లేవు. ఉద్యోగులు, ఏజెంట్లు కలిసి పనిచేయడం మరింత పెరుగుతుంది. దాంతో కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుంది. అలాగే గత నాలుగు త్రైమాసికాలుగా సంస్థ ఏఐ ఆదాయం స్థిరంగా పెరుగుతూ వస్తోంది'' అని చంద్రశేఖరన్ వెల్లడించారు.

## యాపిల్ ఐఓఎస్ 27 ఈ ఫోన్లకే..



టెక్ దిగ్గజం యాపిల్ సరికొత్త ఓఎస్ అప్‌డేట్‌తో ముందుకొచ్చింది. ప్రస్తుతమున్న ఓఎస్‌లో పలు మార్పులు చేయడంతో పాటు అత్యాధునిక ఫీచర్లను జోడిస్తూ ఐఓఎస్ 27ను తీసుకొస్తోంది. కాలిఫోర్నియాలో నిర్వహిస్తున్న వరల్డ్‌వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ లో కొత్త అప్‌డేట్‌పై ప్రకటన చేసింది. లిక్విడ్ గ్లాస్ డిజైన్ మార్చడంతో పాటు ఫొటోస్, మెయిల్ యాప్స్‌లో కొత్త ఫీచర్లను తీసుకొచ్చింది. చైల్డ్ సేఫ్టీ ఫీచర్‌ను మరింత మెరుగుపరిచింది. దీంతో పాటు యాపిల్ ఇంటెలిజెన్స్ మద్దతుతో కూడిన సిరి ఏఐ ని కూడా ఆవిష్కరించింది. ఐఓఎస్ 27 ఈ ఏడాది చివర్లో అందుబాటులోకి రానుంది. ఐఫోన్ 11, ఆ తర్వాత వచ్చిన మోడళ్లకు ఈ ఓఎస్ అప్‌డేట్ అందుతుంది. ఎస్ఈ 2020 మోడల్‌కు కూడా ఐఓఎస్ 27 లభిస్తుంది. ఈ ఫీచర్లను ముందుగా పొందాలంటే యాపిల్ విడుదల చేసిన ఐఓఎస్ బీటా–1 కోసం రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. అందరికంటే ముందుగానే ఈ ఫీచర్లను వినియోగించాలంటే beta.apple.com. పోర్టల్‌కు వెళ్లాలి. అక్కడ యాపిల్ ఐడీతో సైన్–అప్ అయ్యి టర్మ్స్ అండ్ కండీషన్స్ యాక్సెప్ట్ చేయాలి. ఐఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఆ తర్వాత జనరల్ ఆప్షన్ ఎంపిక చేసుకొని సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాలి. బీటా అప్‌డేట్స్ ఆప్షన్ సెలెక్ట్ చేసుకుని డెవలపర్ బీటా ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. అప్‌డేట్ పేజీలో కొత్త అప్‌డేట్ వస్తుంది. దీన్నిఇన్‌స్టాల్‌చేసుకోవాలి. ఐఓఎస్ 27 డెవలపర్ బీటా 1 వెర్షన్‌ను ఇన్‌స్టాల్ చేసే ముందు ఐఫోన్‌లోని డేటాను బ్యాకప్ చేసుకోవడం మంచిది.

## డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు ఇక 50 ఏళ్లు?

దేశవ్యాప్తంగా లక్షల మంది వాహనదారులకు ఊరట కల్పించేలా కేంద్రప్రభుత్వం కీలక ఆలోచన చేస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు గడువును 20 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచే అంశాన్ని పరిశీలిస్తోంది. అదే జరిగితే డ్రైవింగ్ లైసెన్స్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తప్పుతుంది. డ్రైవింగ్ లైసెన్స్ కాలపరిమితితో పాటు మరిన్ని ప్రతిపాదనలు రహదారి మంత్రిత్వశాఖ పరిశీలనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఎవరైనా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుంటే 20 ఏళ్ల వరకు మాత్రమే అది చెల్లుబాటు అవుతుంది. ఆపై అవసరమైన పత్రాలు సమర్పించి లైసెన్స్‌ను రెన్యువల్ చేయించుకోవాలి. కొన్ని సందర్భాల్లో వైద్య ధ్రువీకరణ పత్రం కూడా అవసరం పడుతుంది. ఈ క్రమంలోనే కాలపరిమితిని 50 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే, దీనివల్ల రెన్యువల్‌పై రావాల్సిన ఆదాయం తగ్గిపోతుందని రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు.








## బంగ్లా క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా తమిమ్

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) నూతన అధ్యక్షుడిగా మాజీ కెప్టెన్ తమిమ్ ఇక్బాల్ నియమితుడయ్యాడు. 75 మంది కౌన్సిలర్లు పాల్గొన్న ఓటింగ్‌లో.. 73 ఓట్లతో 37 ఏళ్ల తమిమ్ బీసీబీ 21వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ పదవి చేపట్టిన పిన్న వయస్కుడు కూడా అతడే. ఏప్రిల్‌లో అడ్‌హక్ కమిటీ బాధ్యతలు అందుకున్న తమిమ్.. ఇప్పుడు బీసీబీ అత్యున్నత పదవిలో కూర్చోవడం గమనార్హం. తమిమ్ 70 టెస్టులు, 243 వన్డేల్లో బంగ్లాకు ప్రాతినిధ్యం వహించాడు.

# రుతురాజ్ గైక్వాడ్ శతకం..
# శ్రీలంక ఎ లక్ష్యం 278

దంబుల్లా వేదికగా ట్రై నేషన్ ఎ సిరీస్‌లో భాగంగా శ్రీలంక ఎ, భారత్ ఎ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఎ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ శతకంతో సత్తా చాటాడు. కెప్టెన్ తిలక్ వర్మ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అయితే భారతజట్టుకు ఆరంభంలోనే వరుస షాక్‌లు తగిలాయి. తొలుత వైభవ్ సూర్యవంశీ (14), తర్వాత కొన్ని బంతులకే.. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (2) పెవిలియన్‌కు చేరాడు. దీంతో 16 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి టీమ్‌ఇండియా కష్టాల్లో కూరుకుపోయినట్లు కనిపించింది. కానీ ప్రియాంశ్ ఆర్య (32), రుతురాజ్ గైక్వాడ్ (101; 114 బంతుల్లో, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆర్య ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ చక్కటి సహకారం అందించాడు. రుతురాజ్‌తో కలిసి.. నాలుగో వికెట్ 150 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. సెంచరీ చేసిన కాసేపటికే రుతురాజ్ పెవిలియన్‌కు చేరాడు. తర్వాత తిలక్ వర్మ (60; 97 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా ఔటయ్యాడు. అనంతరం ఆయుష్ బధోని (24; 18 బంతుల్లో, 2 ఫోర్లు) సూర్యాంశ్ షిడ్జే (26★; 14 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్స్‌లు) వేగంగా పరుగులు రాబట్టే ప్రయత్నం చేశారు. చివరి ఓవర్లో ఆయుష్ బధోని ఔటయ్యాడు. అనుకుల్ రాయ్ (1★) నాటౌట్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో మహ్మద్ షిరాజ్ 2, చమిక కరుణ రత్నే, వనుజ సహన్, గరుక సంకేత్ తలో వికెట్ తీసుకున్నారు. అయితే, మ్యాచ్‌లో 13వ ఓవర్‌లో రెండో పరుగు తీసే క్రమంలో ప్రియాంశ్ ఆర్య (32) రనౌట్ అయ్యాడు. మొదట రెండో పరుగుకు అంగీకరించిన ప్రియాంశ్ తర్వాత సందిగ్ధంలోపడ్డాడు. చివరకు రుతురాజ్ గైక్వాడ్, ప్రియాంశ్ ఇద్దరూ ఒకే ఎండ్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లా కాలు కింద ప్రియాంశ్ బ్యాట్ ఇరుక్కుపోయింది. దీంతో ముందే క్రీజులోకి చేరుకున్న రుతురాజ్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. క్రీజులో ఆలస్యంగా బ్యాట్ పెట్టిన ప్రియాంశ్ ఆర్యను థర్డ్ అంపైర్ రనౌట్‌గా ప్రకటించాడు. అయితే, వికెట్ కీపర్.. ప్రియాంశ్ బ్యాట్‌పై కాలు పెట్టడాన్ని అంపైర్ పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని అభిమానులు తప్పుబడుతున్నారు.



## పాకిస్థాన్‌లో ఆడటం కన్నా.. ప్రమాదకరం ఇంకేం ఉంటుంది: లిటన్ దాస్

కొన్ని నెలల క్రితం భారత్, శ్రీలంక ఉమ్మడి ఆతిథ్యంలో జరిగిన టీ20 వరల్డ్ కప్ టోర్నీ నుంచి బంగ్లాదేశ్ వైదొలగిన విషయం తెలిసిందే. దానికి ఆ దేశ క్రికెట్ బోర్డు భద్రతపరమైన కారణాలను సాకుగా చూపింది. ఐసీసీ ఎంత సర్దిచెప్పడానికి ప్రయత్నించినా.. బంగ్లా దేశ్ క్రికెట్ బోర్డు మొండి పట్టును వీడలేదు. అయితే ఈ నిర్ణయంపై బంగ్లాదేశ్ టీ20 కెప్టెన్ లిటన్ దాస్ తాజాగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. తమ జట్టు భారత్ వెళ్లకూడదనే నిర్ణయం బోర్డు పెద్దలే తీసుకున్నారని, ఇందులో ఆటగాళ్ల పాత్ర లేదని లిటన్ దాస్ కుండ బద్దలు కొట్టాడు. పాకిస్థాన్‌లో తుపాకుల మధ్య తాము ఆడినప్పుడు భారత్‌లో ఆడటం ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించాడు. 'బోర్డు అధికారులు మాకు భారత్‌లో భద్రత లేదని చెప్పారు. అప్పుడు మేం వారితో.. 'మేమంతా పాకిస్థాన్‌లో కూడా ఆడాం కదా. అక్కడైతే మా గదుల బయట తుపాకులు పట్టుకుని నిల్చునే వారు. ఇంత కన్నా ప్రమాదకరమైన పరిస్థితులు ఇంకేముంటాయి. పాక్‌లో ఆడినప్పుడు.. భారత్‌లో ఎందుకు ఆడలేం' అని అధికారులను మేంప్రశ్నించాం'' అని లిటన్ దాస్ వివరించాడు. అయితే గతంలో లిటన్ దాస్.. బంగ్లాదేశ్ ప్రీమి యర్ లీగ్‌లో మ్యాచ్ అనంతరం ఈ అంశమై విలేకరులు అడిగిన ప్రశ్నకు మరోలా సమాధానమిచ్చాడు. 'మేం వరల్డ్ కప్ ఆడతామని మీరు అనుకుంటున్నారా? నాకు, నా టీమ్‌నకు క్లారిటీ లేదు. నేనైతే సమాధానం చెప్పను. మీరు ఏం ప్రశ్న అడగాలనుకుంటున్నారో నాకు తెలుసు. కానీ అది నాకు సురక్షితం కాదు. సమాధానం చెప్పను' అని అతడు అన్నాడు. ఆటగాళ్లు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సమష్టిగా టోర్నమెంట్‌లో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నాయని క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఇంతకుముందు పేర్కొన్నారు. ఈ వాదనను లిటన్ దాస్‌తోసిపుచ్చాడు. ఇది ఏకాభిప్రాయంతో తీసుకున్న నిర్ణయం కాదన్నాడు. ఆటగాళ్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని వాపోయాడు. బంగ్లాదేశ్ చివరి నిమిషంలో తమ వేదికను శ్రీలంకకు తరలించమని కోరడంతో దానికి ఐసీసీ అంగీకరించలేదు. దీంతో బంగ్లాదేశ్ అర్ధాంతరంగా మెగా టోర్నీ నుంచి వైదొలిగింది.



## వైభవ్ సూర్యవంశీ విఫలం!

దంబుల్లా వేదికగా ట్రై సిరీస్‌లో భాగంగా.. శ్రీలంక ఎ, భారత్ ఎ.. తొలి వన్డేలో తలపడుతున్నాయి. టాస్ గెలిచిన టీమ్‌ఇండియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఆదిలోనే భారత్‌కు షాక్ తగిలింది. 16 పరుగుల జట్టు స్కోర్ వద్ద వైభవ్ సూర్యవంశీ (14; 12 బంతుల్లో 3 ఫోర్లు) తొలివికెట్‌గా వెనుదిరిగాడు. మహ్మద్ షిరాజ్ బౌలింగ్‌లో (3.4) సహాన్ అరచ్చిగేకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (2) సైతం బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. కరుణ రత్నే బౌలింగ్‌లో (4.1) అతడు సమరవిక్రమకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో భారత్ 16 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం ప్రియాంశ్ ఆర్య (17★), రుతురాజ్ గైక్వాడ్ (2★) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. 8 ఓవర్లు ముగిసేసరికి భారత్ ఎ జట్టు 2 వికెట్ల నష్టానికి 35 పరుగులు చేసింది.



## ఇక అర్జున్ తెందుల్కర్ మరోసారి..: శివమ్ దూబె

ముంబయి టీ20 లీగ్‌లో భాగంగా సోమవారం ఏఆర్‌సీఎస్ అంధేరీ, బాంద్రా బ్లాస్టర్స్ జట్లు తలపడ్డాయి. సచిన్ తెందుల్కర్ తనయుడు అర్జున్ తెందుల్కర్ అంధేరీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో అర్జున్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. బౌలింగ్‌లో కేవలం 11 పరుగులిచ్చి 3 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే ఒక ఓవర్ మెయిడిన్ చేశాడు. ఇక బ్యాటింగ్‌లో అజేయ హాఫ్‌సెంచరీ సాధించాడు. దీంతో అంధేరీ జట్టు కెప్టెన్ శివమ్ దూబె.. డ్రెస్సింగ్ రూమ్‌లో అర్జున్‌ను ప్రశంసించాడు. మన జట్టులో ఒక్కరు కాదు ఇద్దరు బ్యాక్ బోన్స్ ఉన్నారు. వారు అజయ్ మిశ్రా, ముషీర్ ఖాన్. దివ్యాంశ్ గొప్ప ఆరంభం అందించాడు. ముషీర్



ప్రత్యేక ఇన్నింగ్స్ ఆడాడు. ఇక అర్జున్ మరోసారి..' అని అనగానే జట్టు సభ్యులంతా చప్పట్లతో అభినందించారు. అర్జున్ తెందుల్కర్ చిరునవ్వులు చిందించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన బాంద్రా బ్లాస్టర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన అంధేరీ జట్టు 13.5 ఓవర్లలోనే 1 వికెట్ నష్టపోయి 148 పరుగులు చేసింది. దీంతో ఈ మ్యాచ్‌లో అంధేరీ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

